01ATP07_01ATP07.qxd 07-05-2025 PM 11:01 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 08 మే 2025 పేజీలు : 04


# రేపు సీఎం చంద్రబాబు అనంతపురం పర్యటన ఖరారు

- హంద్రీనీవా కాలవ విస్తరణ పనులు పరిశీలన
- ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం
- సాయంత్రం బెంగుళూరులో ప్రత్యేక కార్యక్రమం

**అనంతపురం, మే 7 ప్రభాతవార్త బ్యూరో**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 9వ తేదిన అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద ప్రధాన కాలువ విస్తరణ పనులను పరిశీలించేందుకు వస్తున్నారు. ఈ మేరకు అధికారికంగా కార్యక్రమం వెలువడింది. పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి..



సీఎం చంద్రబాబునాయుడు 9వ తేదిన ఉదయం 9:30 గంటలకు విజయవాడలోని ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరి 10:05కు విజయవాడ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు, అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో సత్యసాయి జిల్లా పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 10:55గంటలకు పుట్టపర్తిలో ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో బయల్దేరి 11:25 గంటలకు అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం ఛాయాపురంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ 11:25 నుంచి 11:35 వరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సీఎంకు స్వాగతం పలుకుతారు. 11:35 ఛాయాపురంలోని హెలీప్యాడ్ వద్ద నుంచి కారులో రోడ్డు మార్గాన బయల్దేరి 11:45 గంటలకు ఛాయాపురం సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్దకు చేరుకుంటారు. అక్కడ 11:40 గంటల నుంచి 12:10 గంటల వరకు కాలువ వెడల్పు పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతారు. మధ్యాహ్నం 12:10 గంటలకు హంద్రీనీవా కాలువ వద్ద నుంచి బయల్దేరి ఛాయాపురం వద్ద ఏర్పాటు చేసిన ప్రజా వేదికకు చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 12:15 గంటల నుంచి 12:45 గంటల వరకు నీటి పారుదల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తారు. కొద్దిసేపు విరామం తర్వాత మధ్యాహ్నం 1:20 గంటల నుంచి 2:50 గంటల వరకు ఛాయాపురం గ్రామ పంచాయితీ ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆ తర్వాత ప్రజా వేదిక వద్ద నుంచి రోడ్డు మార్గాన కారులో ఛాయాపురంలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడ నుంచి హెలీ క్యాప్టర్‌లో పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 9వ తేది సాయంత్రం 3:40 గంటల ప్రాంతంలో సత్యసాయి ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి 4:00 గంటలకు బెంగుళూరు ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు.

ఆ తర్వాత అదే రోజు సాయంత్రం 5:00 గంటలకు బెంగుళూరులోని హోటల్ తాజ్ వెస్ట్ ఎండ్‌లో ద హిందు హడల్ ఇండియా ఇన్ డయలాగ్ అనే కార్యక్రమంలో ఏపి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొంటారు. సాయంత్రం 5:40 గంటల ప్రాంతంలో ఆ కార్యక్రమం నుంచి బయటికి వచ్చి బెంగుళూరు ఎయిర్ పోర్టుకు చేరుకుని ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగం పేట ఎయిర్‌పోర్టుకు సాయంత్రం 7 గంటలకు చేరుకుంటారు. హైదరాబాద్‌లోని సీఎం తన నివాసానికి వెళ్లారని అధికార వర్గాలు తెలిపాయి.

## కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి పర్యటన వాయిదా

**- సీఎం ప్రోగ్రాం తర్వాత వెళ్లాలని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా మాజీ ఎమ్మెల్యేకి లేఖ**

**అనంతపురం, మే 7 ప్రభాతవార్త బ్యూరో**



అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఈ నెల 8వ తేదిన గురువారం తాడిపత్రికి వెళ్లే అవకాశం లేనట్లు కనిపిస్తోంది. సీఎం జిల్లా పర్యటన తర్వాత పోలీసు బందోబస్తుతో రాష్ట్ర హై కోర్టు అనుమతి మేరకు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నెల 8వ తేదిన తాడిపత్రికి వెళ్తానని, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రకటించి ఆ మేరకు ఏర్పాట్లు చేసుకుంటున్న నేపథ్యంలో అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేకంగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి లేఖ రాశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 9వ తేదిన ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీనీవా విస్తరణ, లైనింగ్ పనులను పరిశీలించేందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం జిల్లా పర్యటన ఉన్నందున సీఎం పర్యటన పూర్తి అయిన తర్వాత తాడిపత్రికి వెళ్లేందుకు పోలీసు బందోబస్తు కల్పిస్తామని జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేకంగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి లేఖ రాశారు. జిల్లా ఎస్పీ లేఖను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 8వ తేదిన తాడిపత్రికి వెళ్లాలన్న ఆలోచనను మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఉప సంహరించుకున్నట్లు వైసిపి వర్గాలు చెబుతున్నాయి.

## కల్లూరు గ్రామంలో విషాదం

**- కెనాల్‌లో బట్టలు ఉతకడానికి వెళ్లి ముగ్గురు మృతి**





కెనాల్‌లో పడి మృతిచెందిన వారు

**యల్లనూరు, మే 7 ప్రభాతవార్త**

యల్లనూరు మండలం కల్లూరు గ్రామం వద్ద ఉన్న పులివెందుల బ్రాంచ్ కెనాల్ లో బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు ముగ్గురు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కల్లూరు గ్రామానికి చెందిన నాగలక్షుమ్మ (60) బట్టలు ఉతుకేందుకు కాలువ వద్దకు వెళ్లింది. ఆమెతో పాటు మనవడు జాషువా (7), మనవరాలు లిడియా (9) కాలువ వద్దకు వెళ్లారు. నాగలక్షుమ్మ బట్టలు ఉతుకు తుండగా మనవడు, మనవరాలు కాలువలో ఆడుకునేందుకు దిగి ప్రమాదవశాత్తు మునిగి పోతుండగా వారిని కాపాడేందుకు వెళ్లిన నాగలక్షుమ్మ కూడా కాలువలో మునిగి మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది.

## హంద్రీనీవాను 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలి

-గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 6,300 క్యూసెక్కులకు వెడల్పుకు టెండర్లు జరిగాయి

-నీటిని వేగంగా తీసుకొస్తారు సరే..తెచ్చిన నీటిని నిల్వ ఉంచి వాడేందుకు చర్యలేవి

-జీడీపల్లి జలాశయం నీటి నిలువ సామర్థ్యాన్ని 4 టీఎంసీలకు పెంచాల్సిన అవసరం ఉంది

-విలేఖరులతో ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మెన్ వై.శివరామిరెడ్డి

**ఉరవకొండ, మే 7 ప్రభాతవార్త**

హంద్రీనీవా ప్రధాన కాలువను 3,850 క్యూసెక్కులకు కాకుండా 10,000 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలని ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మెన్ వై.శివరామిరెడ్డి కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. రాయలసీమ అంటేనే కరువు, వలసలు, రైతుల ఆత్మహత్యలు అధికమని సీమ సస్యశామలం కావాలన్నా, బాగుపడాలన్నా నీరు చాలా అవసరమని దశాబ్దాల కాలం క్రితం నుంచే రాయలసీమకు కృష్ణా జలాలు తరిస్తేనే ఉపయోగమని అనేక పోరాటాలు జరిగాయన్నారు. ఈ క్రమంలోనే అందరూ మాటలకు పరిమితమైతే దివంగత వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్య మంత్రి అయిన తరువాత హంద్రీనీవాను 40 టీఎంసీల సామర్థ్యంతో పనులు చేపట్టారన్నారు. ఈక్రమంలోనే 2012 నుంచి జీడిపల్లికు కృష్ణా జలాలు వస్తున్నాయన్నారు. అనంతపురం జిల్లాకు తుంగభద్ర జలాలు జీవనాడిగా ఉండేవని, హంద్రీనీవా పూర్తి అయిన తరువాత తుంగభద్రకు హంద్రీనీవా తోడైందన్నారు. నాడు కాంగ్రెస్ పెద్దలు పాదయాత్ర ద్వారా మల్యాల నుంచి జీడిపల్లి వరకు నీటిని తీసుకొచ్చా రన్నారు. నాటి సీయం ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి మొదటిదశ పనులను పూర్తిచేసి నీటిని ఇవ్వగలిగారన్నారు. రెండో దశలో పనులు చాలా వరకు పూర్తి అయినప్పటికీ అక్కడక్కడా ఇబ్బందులు కారణంగా పూర్తి చేయకపోవడంతో నీటిని ముందు తీసుకెళ్లడానికి సాధ్యం కాలేదన్నారు. 2వ దశలో బుక్కపట్నం మండలంలో మరాల రిజర్వాయర్, కదిరి సమీపంలో చెర్లోపల్లి రిజర్వాయర్లు పూర్తి చేయించి చిత్తూరు జిలాలకు నీళ్లు తీసుకెళ్లడానికి కావలను తీయించారన్నారు. మరోవైపు మడకశిర బ్రాంచి కెనాల్ తవ్వకాలు చేపట్టడం జరిగిందని మొదటి, రెండు దశల్లో లక్ష ఎకరాలకు సాగునీటిని సాగునీటి అందించాలని లక్ష్యం ఉండేదన్నారు. అయితే అనుకున్న స్థాయిలో



వై.శివరామిరెడ్డి

నీరు రాకపోవడంతో పిల్ల కాలువల నిర్మాణం ఆగిపోయిందన్నారు. జిల్లాకు 10 టీఎంసీలకు పైగా తాగునీటికి కేటాయించాల్సి పరిస్థితి ఏర్పడిందని ఇది భవిష్యత్తులో 15 టీఎంసీలకు పెరుగుతుందని అంచనా ఉందన్నారు. తుంగభద్ర, హంద్రీనీవా రెండూ కలుపుకున్నా 35 టీఎంసీలు మించి రావడంలేదన్నారు. హంద్రీనీవాకు ఎటువంటి కేటాయింపులు లేకపోయినప్పటికీ కొత్త ప్రాజెక్టులు కడుతున్నారని హంద్రీనీవాను 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో తవ్వితే 2,200 క్యూసెక్కులు మాత్రమే నీరు వస్తున్నాయని వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్య మంత్రి అయిన తరువాత 6,300 క్యూసెక్కులకు తవ్వించాలని నిర్ణయం తీసుకొని టెండర్లు కూడా నిర్వహించారని అయితే పనులు ప్రారంభం కాలేదన్నారు. హంద్రీనీవా ద్వారా 40 టీఎంసీలు కాకుండా 70 నుంచి 80 టీఎంసీ నీరు తీసుకురావాలంటే తప్పకుండా వెడల్పు చేయాల్సిఉందేనని మోదటి ఫేజ్‌లో 3,850 క్యూసెక్కులకు కాలువ వెడల్పు చేస్తాం, రెండో ఫేజ్‌లో లైనింగ్ చేస్తామంటే ఈ ప్రాంతానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఎమ్మెల్సీ వాపోయారు. లైనింగ్‌వల్ల నీరు వేగంగా ముందుకు వెళుతుందిగాని భూగర్భ జలాలు పెరుగవన్నారు. జీడీపల్లి జలాశయం నీటి నిలువ సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న 1.68 టీఎంసీలు నుండి 4 టీఎంసీలకు పెంచడానికి వీలుగా గత ప్రభుత్వంలో 675 కోట్ల రూపాయలతో ప్రాజెక్టు రిపోర్టు తయారుచేసి ఆమోదం కోసం పంపడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టును ఇప్పుడు ఆమోదించినట్లైతే చిత్తూరు జిల్లా చివరి వరకు ఆయకట్టుకు నీటిని అందించ వచ్చన్నారు. ప్రస్తుతం విస్తరణ పనులకు 1,336 కోట్లు ఖర్చు చేసేలా ప్రతిపాదించారని అలాంటప్పుడు కేవలం 675 కోట్ల రూపాయలతో జీడీపల్లి జలాశయాన్ని 4 టీఎంసీల సామర్థ్యానికి పెంచేలా చేస్తే రాయలసీమకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కోరారు.

## పియం సూర్య ఘర్ పథకానికి 65000 దరఖాస్తులే లక్ష్యం





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్, హాజరైన సంబంధిత అధికారులు

**పుట్టపర్తి (కలెక్టరేట్), మే ,7, ప్రభాతవార్త**

పియం సూర్య ఘర్ పథకానికి శ్రీసత్యసాయి జిల్లాలో 65000 దరఖాస్తులు స్వీకరించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో మినీ కాన్ఫరెన్స్ హాలు నందు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో పాటు జిల్లా పంచాయతీ, ఉపాధి పనులు, పీఎం సూర్య ఘర్ వివిధ పథకాల అమలు తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పియం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి లబ్దిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.60వేలు, రాష్ట్ర ప్రభుత్వం 55 వేల రూ.లను సబ్సిడీగా అందించి నూరు శాతం ఉచితంగా అందిస్తుందని తెలిపారు.వారి అవసరాలకు వినియోగించు కోగా మిగిలిన విద్యుత్ ను గ్రిడ్ కు అందిస్తే యూనిట్ కు రూ.2.90 పైసలు వంతున చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఎస్‌సి, ఎస్‌టిలకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, ఈపథకం అమలుతో వారికి మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. అదే బిసి వర్గాలకు అయితే 2కిలో వాట్ కు కేంద్రం 60 వేల రూ.లు, రాష్ట్ర ప్రభుత్వం 20 వేలు అందించనుండగా మరో 35 వేల రూ.లను లబ్దిదారులు బ్యాంకు ద్వారా రుణం పొంది 5ఏళ్ళ కాలపరిమితితో తిరిగి చెల్లించ వచ్చని అన్నారు. ఇళ్ల కప్పులపై సోలార్ ప్యానల్ ను ఏర్పాటు చేయడానికి 40 వరకు ప్రభుత్వం రాయితీస్తుందని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఆర్డిఓలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, డిఇఇలు, తహశీల్దార్లు, ఎపిఎం, ఎంఇపిఎంఎ మరియు బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని ఎపిఎస్‌పి డిసిఎల్ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ ఎస్సీ ఈ సంపత్ కుమార్, సోలార్ అధికారి వివేక్, డిపిఓ సమత, డ్వామా పిడి విజయేంద్ర ప్రసాద్, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన కోసం ఏర్పాట్లు వేగవంతంగా చేపట్టాలి

- చరిత్రలో లేని విధంగా శరవేగంగా హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు చేస్తున్నాం
- రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, మే 7 ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కోసం అన్ని ఏర్పాట్లు వేగవంతంగా చేపట్టాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్ద ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, హెచ్‌ఎన్‌ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులు, గ్రామ సభకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హంద్రీనీవా కాలువ వెడల్పు చేసే పనులన్నింటిని పరిశీలించడానికి ఈనెల 9వ తేదీన వజ్రకరూరు మండలం కొనకొండ్ల ఛాయపురం మధ్యనున్న కెనాల్ ప్రాంతాన్ని సందర్శించనున్నా రన్నారు. కాలువ వెడల్పు పనులు ఎంత మేరకు జరిగింది, పనుల పూర్తికి ఇంకా ఎన్ని రోజులు పడుతుంది అనేదానిపై సమీక్ష నిర్వహించనున్నా రన్నారు. ఇప్పటికే దాదాపు 50 60 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ముఖ్యమంత్రి పదేపదే చెప్తున్నారని, జూలై 10వ తేదీ డెడ్ లైన్ పెట్టారని, పదవ తేదీలోపల పనులు పూర్తి కావాలన్నారు. ఇది చరిత్రలో ఏ ప్రభుత్వంలోనూ జరిగినటువంటి పనులని, గతంలో ఎప్పుడో ముఖ్యమంత్రులు వచ్చి ఎప్పుడో బడ్జెట్ పెట్టి ఆ తర్వాత శంకుస్థాపనలు పెట్టి అనంతరం ఎప్పటికో పనులు ప్రారంభమయ్యేవన్నారు. ఇక్కడ హంద్రీనీవా కాలువకు బడ్జెట్ లో కేటాయింపులు చేసిన వారంలోనే పనులు ప్రారంభమయ్యాయని, కేవలం 70, 75 రోజుల్లోనే ఇప్పుడున్న నీటికి రెట్టింపు సామర్థ్యాన్ని తీసుకువచ్చేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనులను వేగవంతం చేశారని, అది రాష్ట్ర ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధి అన్నారు. గతంలో 2019కి ముందు ఉరవకొండలో జగన్ మోహన్ రెడ్డి జలదీక్ష పేరు పెట్టి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో హంద్రీనీవా ఆయకట్టును పూర్తి చేస్తానని మాట చెప్పారని అయితే గత ఐదేళ్లలో గంపమన్ను కూడా తీయలేదన్నారు. తమ ప్రభుత్వం ఈరోజు పనులు చేస్తున్నామని, చరిత్రలో లేని విధంగా శరవేగంగా పనులు చేస్తున్నామని, వారు చేయలేని పనులను చిత్తశుద్ధితో, బాధ్యతగా చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రెస్ మీట్ లు పెట్టి పనులు చేయడం లేదని, ఏదో జరిగిపోతోందని చెబుతున్నారని, ఉరవకొండలో డ్రైనేజీలను తవ్వి రాయలసీమ ప్రాజెక్టుల గురించి వారు మాట్లాడితే బాగుంటుందన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో తాగునీరు, సాగునీరు తమ పార్టీ హయాంలోనే తీసుకురావడం జరిగిందన్నారు. తాము పనులు చేయాలనుకుంటున్నామని, అందుకు సలహాలు ఇవ్వాలని, జిల్లాకు సాగునీరు ఇంకా ఎలా పెంచాలి, ఏమైనా అవకాశం ఉందా అనేది ఆలోచిస్తున్నామన్నారు. చరిత్రలో లేని విధంగా ఆరు పంపులను 12 పంపులు వాడే రకంగా పనులు చేయాలనుకుంటున్నామని, దానిని అభినందించాలని, లేకపోతే నిశ్శబ్దంగా ఉండాలని, ప్రజలే మమ్మల్ని అభినందిస్తారన్నారు. ప్రధానంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రాయలసీమ ప్రాంతంపై ఉన్న ప్రత్యేక శ్రద్ధతో ఇంతకుముందు చరిత్రలో లేనటువంటి బడ్జెట్ కేటాయింపులు చేశారని, పోలవరం తర్వాత ఎక్కువ నిధులు కేటాయించింది హంద్రీనీవాకేనని, కేవలం కేటాయింపులు పెట్టుకోలేదని, పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పేమెంట్లు కూడా మొదలు పెడతామన్నారు. కాలువ వెడల్పు పనులను చిత్తశుద్ధితో పూర్తి చేస్తామని, జిల్లా ప్రజల రుణం తీర్చుకునేందుకు మా శాసనసభ్యులు, తాను, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. ఓఎంసి కేసులో సుప్రీంకోర్టు తీర్పుకు సంబంధించి తమకు వ్యక్తుల పట్ల ద్వేషం లేదని, ప్రజలకు సంబంధించిన ఆస్తులు దోపిడీ జరిగాయని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరోజు మొట్టమొదటిసారి అసెంబ్లీలో మాట్లాడి పోరాటం చేశారని, వ్యవస్థల్ని కాపాడాలని, వ్యవస్థలను మేలుకొల్పాలని తాము పోరాటం చేశామని, ఆలస్యం అవుతుందేమోగాని న్యాయం తప్పకుండా జరుగుతుందని, సత్యమేవ జయతి అనేది ఏదైతే ఉంటుందో అది సత్యం ఇవాళ జయించిందన్నారు. ప్రజలకు ఉపయోగపడేటువంటివి కొందరు రాజకీయ నాయకుల చేతులలోకి పోయినందుకే ఆరోజు తెలుగుదేశం పార్టీ పోరాటం చేసిందని, ఆ పోరాటంలో నిజాయితీ ఇవాళ స్పష్టంగా అర్థమైందన్నారు. న్యాయ వ్యవస్థలో మొట్టమొదటిసారి జడ్జిమెంట్ రావడం తాము చేసిన పోరాటానికి ఫలితం వచ్చినట్లుగానే భావిస్తామన్నారు. అంతకుముందు హెలిప్యాడ్, హంద్రీనీవా కాలువ వెడల్పు పనుల ప్రదేశాలు, సభా వేదిక ప్రదేశాన్ని పరిశీలించి ఏర్పాట్లపై మంత్రి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, సిఎంఓ కార్యాలయం అధికారులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

## లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్**



అధికారంతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

**ఉరవకొండ, మే 7 ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంలోనున్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయా శాఖల జిల్లా అధికారులతో ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమానికి గ్రామస్తులు, కార్యకర్తలు, ఆయకట్టుదారులు, అందరూ కలిసి 3,000 మంది హాజరయ్యేలా చూడాలని, ఇందుకోసం మొబిలైజేషన్ చేయాలన్నారు. శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని, అన్నిచోట్ల శుభ్రంగా ఉండాలని, ఎక్కడ ప్లాస్టిక్ పేపర్లు ఉండకుండా చూసుకోవాలని డిపిఓని ఆదేశించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద షామియానా ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా వేదిక సభ వద్ద ప్రతి బ్లాక్ లోను ఒక విఆర్ఓ ఉండాలన్నారు. వీఐపీలకు భోజనం ఏర్పాటు, కార్యక్రమానికి హాజరయ్యే అధికారులకు, పోలీసులకు, గ్రామస్తులకు భోజనం ఏర్పాట్లు చేయాలని సూచించారు. హెలిప్యాడ్ లో రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యేక గది, సీఎం కార్యదర్శికి ఒక గది ఏర్పాటు చేయాలని, అక్కడ స్నాక్స్, నీళ్లు, అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. మెనూ చక్కగా ఉండాలని, అందరికీ మంచి భోజనం అందజేయాలన్నారు. బంగారు కుంటుంభంకు సంబంధించిన లబ్ధిదారుల గుర్తింపును పూర్తి చేయాలని, వారికి జీరో పావర్టీ పి4 బంగారు కుంటుంభం గురించి అవగాహన కల్పించాలని, ఈ విషయమై ప్రత్యేక దృష్టి పెట్టాలని సర్పంచ్, ఎంపీడీవోను ఆదేశించారు. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులను కూడా గుర్తించాలన్నారు. వాహనాల పార్కింగ్ కు సంబంధించి అన్ని ఏర్పాట్లు జాగ్రత్తగా చేపట్టాలన్నారు. అనంతరం ఛాయాపురం గ్రామంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పర్యటించి, జీరో పావర్టీ పి4 బంగారు కుంటుంభంకు సంబంధించి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు ఆరా తీశారు. గ్రామంలోని మహేశ్వరి, కె.బాలు, బోయ రాఘవ, టి.రంగనాయకులు ఇళ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబ సభ్యులు, ఆదాయ వనరులు, వృత్తి, భూమి, ఎలాంటి లబ్ధి పొందారు, ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం కావాలని కోరుకుంటున్నారు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో బంగారు కుంటుంభంకు సంబంధించి లబ్ధిదారుల గుర్తింపు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డిఆర్ఓ ఏ.మాలోల, జడ్పీ సీఈవో రామచంద్రారెడ్డి, డిపిఓ నాగరాజు నాయుడు, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, డిఎల్డివోలు లలితబాయి, విజయలక్ష్మి, డిఆర్డిఏ పిడి మరియు సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, మార్కెటింగ్ ఏడి సత్యనారాయణ చౌదరి, పిఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, డ్వామా పిడి సలీమ్ భాష, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి చరిత్ర ఒక ప్రత్యేక అధ్యాయం

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, తదితరులు

**అనంతపురం కలెక్టరేట్ మే 07 ప్రభాతవార్త**

మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు స్ఫూర్తి, ఆదర్శ బాటలో మనందరం నడవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు.బుధవారం ఉదయం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గారు ఆంధ్రప్రదేశ్ లో పుట్టడం అందులోనూ మన తెలుగు వాడిగా పుట్టడం మనం గర్వించదగ్గ విషయమని తెలిపారు.స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి చరిత్ర ఒక ప్రత్యేక అధ్యాయమని,ఆయన స్వాతంత్ర్య పోరాటం ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిందని అన్నారు. గతంలో నేను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం, పార్వతీపురం వివిధ గిరిజన ప్రాంతాలలో పనిచేయడం అల్లూరి సీతారామరాజు తిరిగిన ప్రాంతాలలో సందర్శించడం జరిగిందన్నారు. అల్లూరి సీతారామరాజు గారు 27 సంవత్సరాలు మాత్రమే జీవించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బ్రిటిష్ వారికి విరుద్ధంగా రెండున్నర సంవత్సరాలు బ్రిటిష్ వారు అటవీ ప్రాంతాన్ని దోపిడి చేసి అటవీ సంపదను దోచుకెళ్లే విధంగా చట్టాన్ని రూపొందించుకొని అటవీ సంపదను దోచేసే క్రమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా గిరిజనుల కు అండగా ఉండి గిరిజనుల హక్కులను సాధించేదుకు కృషి చేసిన విప్లవం స్వాతంత్ర పోరాటానికి కూడా ఒక పెద్ద నాయకుడిగా, విప్లవవీరుడిగా నిలిచిపోయిన గొప్పవ్యక్తి అని కొనియాడాడు. మొదటి ప్రపంచ యుద్ధం జరిగే సమయంలో సముద్ర మార్గాన టేకు చెట్లను తీసుకెళ్లేందుకు కష్టంగా ఉన్న తరుణంలో ఎక్కడెక్కడ టేకు చెట్లు, అటవీ సంపదలు ఉన్నాయో ఆప్రాంతాలనుగుర్తించి వాటిని యూరప్, పశ్చిమ దేశాలకు రోడ్డు ఇతరత్రా మార్గాలలో తరలించేందుకు బ్రిటిష్ వారి ప్రయత్నంలో భాగంగా మన రాష్ట్రంలో కొన్నిచోట్ల డిపోలలో ఏర్పాటుచేసి మొదటిగా అక్కడ డిపోలకు తరలించేందుకు కొంతమంది అధికారులను నియమించి వారి ద్వారా ఆ డిపోలకు ఎక్కువ మొత్తంలో చెట్లను నరికి తరలించిన అధికారులకు పదోన్నతులు, జీతభత్యాలు పెంచడంతో అధికారులు పోటీపడి గిరిసంపదను దోచుకెళ్లే విధంగా బ్రిటిష్ దోపిడీని మొదలుపెట్టారని, ఆ దోపిడీని అరికట్టేందుకు అల్లూరి సీతారామరాజు లాంటి వీరులు తయారవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్,డిఆర్ఓ ఏ.మలోల,జిల్లాకలెక్టర్ కార్యాలయం ఏఓ అలెగ్జాండర్, జిల్లాటూరిజంఅధికారి జయకుమార్‌బాబు, డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, ట్రైబుల్ స్కూల్ ప్రిన్సిపాల్ పార్వతి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

02ATP27_02ATP27.qxd 07-05-2025 PM 11:08 Page 1



## నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న బండి....

డి.హీరేహాళ్, మే 07 ప్రభాతవార్త:



నూతన గృహప్రవేశ కార్యక్రమంలో వాల్మీకి సంఘం అధ్యక్షులు బండి

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి క్రిష్ణప్ప నూతన గృహప్రవేశ వేడుకలు, సత్యనారాయణస్వామి పూజల్లో పాల్గొన్నారు. రాయదుర్గం పట్టణం లోని గ్యాస్ గోడన్ ప్రాంతంలో కొత్తపల్లి గౌని సత్యనారాయణరెడ్డి నిర్మించిన నూతన గృహ ప్రవేశ కార్యక్రమంకు సత్తిరెడ్డి దంపతుల ఆహ్వానం మేరకు బుధవారం వాల్మీకి సంఘం అధ్యక్షులు ఆ సేవా సమితి సభ్యులు, మిత్రులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలో నిర్వహించిన సత్యనారాయణస్వామి పూజల్లో ఆయన పాల్గొని స్వామి వారికి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు పుచ్చుకొని నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. అతిచిన్న వయసులోనే సాధారణ కాంట్రాక్టర్ నుండి క్లాస్ వన్ కాంట్రాక్టర్‌గా ఎదిగి సమాజంలో తనకంటూ ఒక స్థానం సంపాదించి అందరితోనూ సఖ్యంగా మెలుగుతూ మంచి వ్యక్తిగా గుర్తింపు పొందడం ఎంతో అభినందించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు వాల్మీకి సంక్షేమ సేవా సమితి సభ్యులు అజయ్‌టైలర్ రఘు, శ్రీరాములు, మిత్రులు హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్, డాక్టర్ శ్రీరామిరెడ్డి, భరత్‌రెడ్డి, వినాయక తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతున్న విద్యాసంస్థల పై చర్యలు తీసుకోండి.

### ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలి...ఏఐఎస్ఎఫ్

రాయదుర్గం రూరల్, మే 07 ప్రభాతవార్త:



నారాయణ స్కూల్ ముందు ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతున్న విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలని, ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజినేయులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు పీజుల దోపిడి పుస్తకాల వ్యాఎపారం అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నారాయణ విద్యాసంస్థల దగ్గర ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్ణయించిన గ్రూపులను కాకుండా విద్యార్థులలో బేధాలు ఉండే విధంగా చదువుకున్న వాడికి ఒక గ్రూపు తక్కువ చదువుకున్న వారికి ఒక గ్రూపు అంటూ టెక్నో సి బ్యాచ్ ఐకాన్ ఐపిఎల్ ఇలా వివిధ గ్రూపులను ఏర్పాటుచేసి పీజులు వసూళ్ల చేస్తున్నారన్నారు. ఒకటవ తరగతికే 30వేల రూపాయల నుండి 50వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్మకూడదని నిబంధన ఉన్నప్పటికి నిబంధన తుంగలో తక్కుతూ పుస్తకాలు రూ.9వేల నుండి రూ.15వేల వరకు విక్రయిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ముందస్తు అడ్మిషన్లను నిలిపివేయాలని, ముద్రించిన పుస్తకాలను విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు రాజు, నాయకులు సంతోష్, యోగేంద్రర, మాంతేష్, నవీన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల పట్ల నిర్లక్ష్యంగా పనిచేస్తున్న వ్యవసాయ అధికారులు....

కణేకల్లు, మే 07 ప్రభాతవార్త:



హైస్కూల్ ఆవరణంలో రైతులు ఆరవేసుకున్న ధాన్యం

మండల పరిధిలోని రైతులు తమ పొలాల్లో సాగు చేసిన పంటను ఈ క్రాపింగ్ చేసే విధానంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతులకు చెప్పకుండా తూతూ మంత్రంగా చేశారని మండల రైతులు ఆరోపించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ప్రతి ఏటా పంట వేసిన నెలలోపే పొలాల దగ్గరికి వచ్చి వ్యవసాయ అధికారులు సిబ్బంది ఈ క్రాపింగ్ బుకింగ్ చేసుకునేవారని, ఈ సారి ఆవేమీ పట్టనట్టు కేవలం బడా రైతులు కొంత మంది పేర్లే ఈ క్రాపింగ్ చేయడంపై వ్యవసాయ అధికారులపై పలు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు. రైతులు ఈ క్రాపింగ్ నమోదు కాలేకపోవడం వలన పండించిన వరి ధాన్యాన్ని కొనేవాడే దిక్కులేక రైతులు విలవిలాడుతున్నారు. వరి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే గత పది రోజుల క్రితం అట్టహాసంగా ప్రారంబించిన వరి ధాన్యాన్ని పట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. పండించిన పంటని బహిరంగ మార్కెట్లో రూ.1900 ఉండగా ప్రభుత్వం రూ.2,350 పంటను అమ్మకుండా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో వేల బస్తాల వరి ధాన్యాన్ని గ్రౌండ్ అంతా ఆరబోసుకున్నారన్నారు. వరుణుడు పగ పట్టి వర్షం వచ్చిందంటే వేల బస్తాలు ధాన్యం గంగార్పణం కావాల్సిందేనని రైతులు నట్టేట మునిగినట్లే రైతు పండించిన ప్రతి బస్తాన్ని ఈ క్రాపింగ్‌తో సంబంధం లేకుండా వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## శరీరక దారుద్యంపై అవగాహన అవసరం...

కళ్యాణదుర్గం టౌన్, మే 07 ప్రభాతవార్త:



జీమ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

శరీరక దారుద్యంపై యువకులకు అవగాహన ఎంతో అవసరమని కళ్యాణదుర్గం డిఎస్పీ రవిబాబు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని చల్లా కాంప్లెక్స్‌లో నూతనంగా నిర్మించిన ప్రో ఇన్‌లైన్‌జిమ్ ఫిట్నెస్ స్టూడియోను ప్రముఖ వైద్యులు డాక్టర్ దేశం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి డిఎస్పీ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువకులు తమ శరీర దారుద్యం పై మంచి అవగాహనతో కలిగి ఉండాలన్నారు. జిమ్ ప్రశాస్త్యాన్ని వివరించి ప్రార్ధన చేసి ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో నవీన్ నిశ్చల్ ఏర్పాటు చేయగా వ్యాఖ్యతగా సామాజిక వేత్త చల్లా కిషోర్ చౌదరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పాసర్స్ పెనుయేలు ఐసయ్య, డియన్‌పాల్, ప్రసాద్‌రావు, బసవరాజు, జూన్‌విక్టర్, రూబెన్, జీమ్స్‌నాయక్, నవీన్ తాత, చల్లా రాజశేకర్‌చౌదరి, జర్నలిస్ట్ లింగప్రసాద్, ఉత్తమ వ్యాయామ ఉపాద్యాయులు కిరన్‌చౌదరి, హెడ్‌మాస్టర్ బాస్కర్, స్వరూప్ ఓబుళరాజు, తీష్, వినోద్, ప్రసాద్, సునీల్, ఆర్టీసి మర్రిస్వామి, మురళీ, మల్లికార్జున, సెలినాచౌదరి, శాంతి, ప్రవల్లిక, వినియ, డాక్టర్సేగిరి, కుమారి, చల్లా హర్షిణి, నివేదికచౌదరి, నిహారక చౌదరి,సావిత్రి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వాసవి జయంతి వేడుకలు

హిందూపురం టౌన్ మే 7 ప్రభాతవార్త



ప్రత్యేక అలంకరణలో వాసవి

జగన్మాత వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు హిందూపురంలో బుధవారం వైభవంగా జరిగాయి. స్థానిక లేపాక్షి రోడ్డులో ఉన్న అష్ట లక్ష్మి దేవాలయంలో వాసవి మాత మూలవిరాట్ కు పంచామృత అభిషేకాలు, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో రజత వాసవి మాత ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. తదుపరి భక్తులకు అన్నసంతర్పణ చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కట్టా రామచంద్ర గుప్త, నాగరాజు, శ్రీనివాసమూర్తి, యుగంధర్, రఘునందన్ గుప్తా తెలిపారు. అదేవిధంగా కోట ప్రాంతంలో ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరాలయంలో మూలవి రాట్ కు బంగారు కవచలంకరణ చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు జేపీకే రాము, కార్యదర్శి శ్రీకాంత్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోండి

హిందూపురం టౌన్ మే 07 ప్రభాతవార్త

హిందూపురం మండల వ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరు రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని హిందూపురం తాసిల్దార్ వెంకటేష్ తెలిపారు. కొత్త రేషన్ కార్డు దరఖాస్తు, రేషన్ కార్డులో సభ్యుల చేరిక, రేషన్ కార్డు విభజన, పాత రేషన్ కార్డు నుంచి సభ్యుల తొలగింపు, రేషన్ కార్డు సరెండర్, చిరునామా మార్పులు, రేషన్ కార్డులో ఆధార్ సీడింగ్ తప్పుగా ఉంటే సవరణలు చేసుకోవచ్చని ఈ సందర్భంగా తాసిల్దార్ తెలిపారు.

## అండేపల్లిలో ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్టాపన

కంబదూరు, మే 07, ప్రభాతవార్త



ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మండలంలోని అండేపల్లి గ్రామంలో కాలజ్ఞాని వీర బ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ శుభ సందర్భంగా ప్రత్యేక పూజలు,హోమం వంటి కార్యక్రమాలతో పాటు భక్తి శ్రద్ధలతో బుధవారం భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన భక్తాదులకు ఆగ్రామడీలర్ కనక శ్రీనివాసులు వారి ఆర్థికసాయంతో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. విచ్చేసిన భక్తాదులకు ఆలయ కమిటీ నిర్వాహకులతో పాటు ఏకలవ్య సేవా సంఘం మండలాధ్యక్షుడు ములకనూరు ఎరుకుల సుబ్బరాయుడు అన్ని సదుపాయాలను సమకూర్చారు.

## శక్తి యాప్ పై అంగన్వాడీలకు అవగాహన కల్పించిన ఎస్ఐ

లేపాక్షి, మే 7 ప్రభాతవార్త:



శక్తి యాప్ పై అంగన్వాడీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

మండల పరిధి లోని అంగన్వాడీ కార్యకర్తలకు లేపాక్షి పోలీస్ స్టేషన్ ఆవరణలో శక్తి యాప్ పై ఎస్సై నరేంద్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాలను తీసుకురావడం జరిగిందన్నారు. మహిళల సంరక్షణ కోసం శక్తి యాప్ ప్రతి మహిళ డౌన్లోడ్ చేసుకునే విధంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీదే అన్నారు. గ్రామాల్లో మత్తు పదార్థాల అమ్మకాలు జరుగుతున్నట్లయితే వెంటనే పోలీసులు దృష్టికి తీసుకురావాలి అన్నారు. చిన్నపిల్లల మిస్సింగ్, మైనర్ బాలికల భద్రత కోసం అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నపిల్లల్ని వంకలు, వాగులు, చెరువుల ప్రక్కకు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని సూచించారు. చిన్నపిల్లలపై జరిగే అత్యాచారాలు, భౌతిక దాడులను ఏ విధంగా ఎదుర్కోవాలో వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు దీనిని బాధ్యతగా తీసుకొని గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## లేపాక్షిలో మాక్ డ్రిల్

లేపాక్షి, మే 7 ప్రభాతవార్త:



లేపాక్షిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన లేపాక్షిలో తాహాసిల్దార్ సౌజన్య లక్ష్మి, ఎస్ఐ నరేంద్ర, పిహెచ్సి వైద్యాధికారి వెంకట చిరంజీవి ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. విపత్కర పరిస్థితులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు విన్యాసాలను ప్రయోగాత్మకంగా నిర్వహించారు . జరగకూడని పరిస్థితి ఎదురైనప్పుడు అక్కడ నుండి ఏ విధంగా తప్పించుకోవాలో వివరించారు. ఒకవేళ ప్రమాదం సంభవిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని ఆస్పత్రిలో ఆ వ్యక్తికి మెరుగైన చికిత్స ఏ విధంగా అందిస్తారు ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటికి ఎదుర్కొనే విధానాలను వివరించారు ఈ కార్యక్రమంలో పోలీసులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం రైల్వేస్టేషన్లో మాక్ డ్రిల్ నిర్వహించిన ప్రభుత్వ అధికారులు...!

ధర్మవరం, మే 7(ప్రభాతవార్త)



రైల్వే స్టేషన్లో మాక్ డ్రిల్ చేస్తున్న ఫైర్ సిబ్బంది.

కశ్మీర్ పహల్గాం ఉగ్రవాదుల దాడి తరువాత పాక్తో పెరుగుతున్న ఉద్రిక్తల క్రమంలో కేంద్రం ఆదేశాలమేరకు ప్రజల భద్రతను సన్నద్ధతను పరీక్షించే మాక్డ్రిల్స్ బుధవారం ధర్మవరం రైల్వేస్టేషన్లో అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మహేష్, తహసీల్దార్నటరాజ్, రైల్వే ఎస్ఎం చల్లా నరసానాయుడు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది, మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, జీఆర్పీఎఫ్లు మాక్డ్రిల్లో పాల్గొన్నారు. ఒక వేళ పాకిస్తాన్ మనపై ప్రతి దాడి చేస్తే ఆ సమయంలో ప్రజలు ఎలా స్పందించాలో ఈ మాక్డ్రిల్స్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంబవించినప్పుడు ఎలా రక్షించుకోవాలి, ప్రమాదాల బారిన పడితే వైద్యులు చేసే ప్రథమ చికిత్సలు తదితర వాటిని మాక్ డ్రిల్స్ ద్వారా చేసి చూపించారు. బుధవారం తెల్లవారుజామున ఆపరేషన్ సింధూరాలో పాకిస్తాన్ పై మన వాళ్లు యుద్ధం చేసి కొందరు ఉగ్రవాదులను కూడా హతమార్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ఆఫీసర్ రాజు, జీఆర్పీఎఫ్ సీఐఅశోక్ కుమార్, వీఆర్ ఓ రవిశేఖరెడ్డి, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## కల్పవృక్ష,హనుమద్వాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు

ధర్మవరం, మే 7(ప్రభాతవార్త)



హనుమద్వాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవుడు

పట్టణంలో శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు బుధవారం ఉదయం, సాయంత్రం చెన్నకేశవుడు కల్పవృ క్షవాహనం, హనుమద్వాహనంపై ఊరేగాడు. చెన్నకేశవుడి ఉత్సవ విగ్రహాలను అర్చకులు కోనేరాచార్యులు, బానుప్రకాశ్లు ప్రత్యేకంగా అలంకరించి ఉదయం కల్పవక్షవాహనం, సాయంత్రం హనుమద్వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. పట్టణ వీధులలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అడహక్ కమిటి చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్, ఈఓవెంకటేశ్వర్లు, అన్నమయ్యసేవా మండలి అధ్యక్షుడు పోరాళ్లపుల్లయ్య పాల్గొన్నారు. గురువారం స్వామివారు ఉదయం పల్లకీఉత్సవం,సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం జరుగుతాయని ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ఆర్డీవో ఆనంద్ కుమార్

పెనుకొండ మే 7 ప్రభాతవార్త



మాక్ డ్రిల్‌లో భాగంగా వైమానిక దాడుల నుండి ఎలా రక్షించుకోవాలో వివరిస్తున్న ఆర్డీవో ఆనంద్ కుమార్

భారత్ పాకిస్తాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న తరుణంలో ప్రజల ప్రభుత్వ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ ఆనంద్ కుమార్ తెలిపారు ప్రత్యర్థులవైమానిక దాడులనుండి ప్రజలు ఎలా రక్షించుకోవాలో ప్రజలకు వివరిస్తూ బుధవారం పట్టణంలోని రైల్వే స్టేషన్లో మార్క్ డ్రిల్ నిర్వహించి అందులో ఆయన మాట్లాడారు. వైమానక దాడి సమయంలో సైరన్ మ్రోగుతుందని అప్పుడు ప్రజలు అప్రమత్తమై పటిష్టమైన గదులలో నికి వెళ్లాలన్నారు. డీఎస్పీ నరసింగప్ప మాట్లాడుతూ యుద్ధ సమయంలో శరణ మ్రోగగానే రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలను పూర్తిగా అన్నారు కొన్ని సమయాలలో బాంబుల దాడులతో అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలా తప్పించుకోవాలో ద్వారా చూపించారు యుద్ధ వాతావరణం సద్దుమణిగేదాకా అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు తహసిల్దార్ శ్రీధర్ మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కదలికలు తెలిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అంది వాళ్ళన్నారు. సి ఐ రాఘువన్ మాట్లాడుతూ ప్రజలు యుద్ధ వాతావరణం వల్ల ఎలాంటి భయాందోళనలకు గురి కావలసిన అవసరం లేదన్నారు సాంఘిక శక్తుల సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలన్నారు కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ ఎస్సై వెంకటేశ్వర్లు అగ్నిమాపక దళ సిబ్బంది విద్యార్థులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## వైసీపీ లో చేరిన కాంగ్రెస్ నేతలు

కంబదూరు, మే 07, ప్రభాత వార్త



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జగన్

కంబదూరు మండలానికి చెందిన కాంగ్రెస్ నేత మాజీ జడ్పిటిసి సభ్యులు, ప్రస్తుత గొల్లపల్లి సర్పంచ్ రామాంజినేయులు, కుందుర్పి మండల కాంగ్రెస్ నేత మాజీ ఎంపిపీ జీకే శ్రీనివాసులు కాంగ్రెస్ పార్టీని వీడి వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం తాడేపల్లిలోని వైసిపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైకాపా అధినేత జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో వారు వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు పార్టీ కండువా కప్పి జగన్ వారిని సాదరంగా ఆహ్వానించారు. వారి వెంట పారిశ్రామిక వేత్త బెస్తరపల్లి జీకే కృష్ణమూర్తి తదితర వైసీపీ నేతలు ఉన్నారు.

## నూతన ఎంపీడిఓగా బాధ్యతలు చేపట్టిన విజయసింహారెడ్డి

బ్రహ్మ సముద్రం మే 7 ప్రభాతవార్త



నూతన ఎంపీడీవో విజయసింహారెడ్డి

బ్రహ్మ సముద్రం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం నందు నూతన ఎంపీడిఓగా విజయసింహారెడ్డి బాధ్యతలు స్వీకరించాడు కర్నూలుంజిల్లా గూగూడు ఎంపీడిఓ కార్యాలయ నందు ఎఓగా పనిచేస్తూ పదోన్నతిపై ఎంపిడిఓ గాబ్రహ్మ సముద్రం మండల కార్యాలయం విధులు చేపట్టడం జరిగింది.

## ధర్మవరం రైల్వేస్టేషన్ ను తనిఖీ చేసిన డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా



రైల్వేట్రాక్ వద్ద చేస్తున్న పనులను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు.

ధర్మవరం, మే 7(ప్రభాతవార్త)

ధర్మవరం రైల్వేస్టేషన్ ను బుధవారం గుంతకల్లు రైల్వే డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణ కుమార్ లు తనిఖీనిర్వహించారు. రైల్వేస్టేషన్లో జరుగుతున్న రెండవ విడత పనులను పరిశీలించి పనుల గురించి రైల్వేఎస్ఎం చల్లా నరసింహనాయుడును అడిగితెలుసుకున్నారు. అనంతరం విశ్రాంతగది, లోకోపైలెట్, గార్డ్ గదులను పరిశీలించారు. అక్కడి నుంచి గుంతకల్లుకు వెళ్లారు.



← రైల్వేస్టేషన్లో రెండవ విడత పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

## ఉగ్రవాదులపై కఠిన చర్యలు అవసరమే... కాలవ

రాయదుర్గం, మే 07 ప్రభాతవార్త:



అమాయక ప్రజలను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదుల పట్ల భారత సైన్యం తీసుకుంటున్న కఠిన చర్యలకు దేశం యావత్తు మద్దతుగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. పాకిస్థాన్ లోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేసి భారత్ దీటైన జవాబు చెప్పిందన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను అంతమొందించడంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎలాంటి చర్యలు తీసుకున్నా వాటిని అందరూ ఆమోదించాలన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని కాలవ శ్రీనివాసులు సూచించారు.

## ఈ నెల 7వ తేది నుండి కొత్తరేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణ

### -జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్

పుట్టపర్తి, మే 7, ప్రభాతవార్త

ఈ నెల 7వ తేది నుండి కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభిస్తున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని 16,89,531 రేషన్ కార్డుదారులందరు ఇప్పటికే ఉన్న కార్డులో కొత్త సభ్యుల చేర్పు లేదా పాతవారి తొలగింపు, చిరునామా మార్పు, కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉన్న పాతకార్డుల్లో మార్పులు చేయాలనుకునేవారికీ, కొత్తగా రేషన్ కార్డు అవస రమైనవారికీ ఇది మంచి అవకాశమన్నారు. ఈసారి ప్రభుత్వం సాంప్రదాయ రేషన్ కార్డులకు ముగింపు పలికిందని, అందరికీ క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ స్మార్ట్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు స్పష్టంగా ముద్రించబడతాయని, కార్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే గత ఆరు నెలలుగా తీసుకున్న రేషన్ వివరాలు కనిపిస్తాయన్నారు. దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే వీలును కల్పించేలా వ్యవస్థ రూపొందించబడిందని, జిఎస్‌డబ్ల్యూఎస్ ప్లాట్‌ఫారమ్‌లో ఏడు రైస్ కార్డ్‌సంబంధిత సేవలు ప్రారంభించబడుతున్నాయని వాటిలో 1. కొత్త బియ్యం కార్డు 2. బియ్యంకార్డుకుసభ్యునిచేరిక 3. బియ్యం కార్డు విభజన4. రైస్ కార్డ్ నుండి సభ్యుల తొలగింపు 5. బియ్యం కార్డు సరెండర్ 6. బియ్యం కార్డులో చిరునామమార్పు 7. రైస్ కార్డ్‌లో ఆధార్ సీడింగ్, తప్పుగా ఉంటే సరిచేసుకోవలెనని తెలియజేశారు.

## ఉగ్ర దాడులపై సత్యసాయి విమానాశ్రయంలో మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌లోని దృశ్యం

శ్రీసత్యసాయి జిల్లా , మే 7, ప్రభాతవార్త ప్రతినిధి:

పెహల్గాం ఉగ్రదాడుల నేపథ్యంలో అనూహ్య పరిణామాలు ఎదురైనప్పుడు ఎలా ఎదుర్కోవాలి, ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలనే అంశాలపై భద్రత పరంగా బుధవారం శ్రీ సత్యసాయి విమానాశ్రయంలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు, జిల్లాకలెక్టర్ టి.ఎస్.చేతన్, జిల్లాఎస్పి వి.రత్నాలు పుట్టపర్తి విమానాశ్రయంలో జరిగిన ఈ మాక్ డ్రిల్ ను పర్యవేక్షించారు. డీఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసులు, ఆర్ఐలు మహేష్, వలి ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. విమానాశ్రయంలో ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు, వెంటనే తీసుకోవలసిన జాగ్రత్తలు, సైరన్లు మోగినప్పుడు తక్షణమే ఏమి చేయాలి రక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలి, అనే విషయాలపై స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫైర్, హెల్త్ సిబ్బంది వెంటనే చేపట్టే చర్యలు మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. వివిఐపిలకు ఎలాంటి రక్షణ కల్పించాలి ప్రమాదం జరిగిన వెంటనే వారిని అంబులెన్స్ ద్వారా హాస్పిటల్ కు ఎలా తరలించాలి , బాంబులు అమర్చిన ప్రాంతాన్ని డాగ్స్ స్క్వాడ్ ద్వారా గుర్తించి వాటిని ఎలా డిస్పోజల్ చేయాలి అనే విషయాలపై ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు విజయకుమార్, శ్రీనివాసులు, ఆర్డీవో సువర్ణ, తాసిల్దార్ కళ్యాణ్ ,సిఐలు, సునీత, సురేష్,ఆర్ ఐ లు, మహేష్,వలి, ఎస్బి ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐలు లింగన్న, కృష్ణమూర్తి ఆర్ఎస్ఐలు వీరన్న, వెంకటేశ్వర్లు,ప్రదీప్ సింగ్, అన్ని శాఖల అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ పై కేతిరెడ్డి మొసలి కన్నీరెందుకు...?

### ముందుగా ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించిన బీజేపీ నాయకుడు హరీష్

ధర్మవరం మే 07(ప్రభాతవార్త)

రాయలసీమ ప్రాంతంలో 55 సంవత్సరాలుగా నిరుపేదలకు వైద్య, విద్య, ఉపాధి, మహిళా సాధికారత వంటి రంగాల్లో సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) సంస్థకు విదేశీ విరాళాల స్వీకరణకు అవసరమైన ఎఫ్‌సీఆర్ఏ (ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) పునరుద్ధరణ నిలిపివేయబడిందన్న విషయం రాష్ట్ర ప్రజ్నలదరికీ తెలిసిన విషయమే..ఈ నేపథ్యంలో, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి గత కొన్ని నెలలుగా మౌనంగా ఉంటూ, నేడు బత్తలపల్లి లో ర్యాలీ నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ నాయకుడు హరీష్ తెలిపారు. ప్రస్తుతం ఆర్డీటీకి మద్దతుగా ర్యాలీలు నిర్వహిస్తూ, సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు కదా! అయితే, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ నిలిపివేయబడినప్పుడు ఆయన ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు...? కేతిరెడ్డి పదవీకాలం ఇంకా ఒకటిన్నర సంవత్సరం ఉండగానే ఆర్డిటికీ ఈ రెన్యువల్ సమస్య వచ్చిన విషయం కేతిరెడ్డికి తెలిసినా... అప్పుడు ఆయన ఎందుకు స్పందించలేదని వారు మండిపడ్డారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో ఎన్నోసార్లు ఆర్డిటి పట్ల చులకనగా మాట్లాడిన సంగతి కేతిరెడ్డి మరిచిపోయాడా...? గుడ్ మార్నింగ్ మీద ఉన్న శ్రద్ధ ఆర్ డి టి సంస్థ పై ఎందుకు ఆ రోజే స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. ప్రజలు ప్రభుత్వ ఇళ్ల మంజూరు గురించి కేతిరెడ్డిని అడుగగా “ వాడు ఆర్డీటీ వాడు కట్టించలేదా ? వాడిని అడిగారా “ అని ఆర్డీటీ సంస్థని వాడు, వీడు అని దూషించి ఇప్పుడు వారికి మద్దతుగా ర్యాలీలు నిర్వహిస్తే ప్రజలు నమ్మరు అని బిజెపి నాయకుడు హరీష్ స్పష్టంగా తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి హయాంలో నియోజకవర్గం ఎంత అభివృద్ధి చెందింది?? ఎంత కబ్జాకు గురిచేసింది?? ప్రజలకు తెలుసన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఆర్డిటిని దూషిస్తూ ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం మీకు తగునా ? అని ప్రశ్నించారు. అప్పట్లో కేతిరెడ్డి మౌనం ఎందుకు మౌనం వహించారు. ఇప్పుడు ఈ ఆకస్మిక ప్రేమ ఆర్డిటిపై ఎందుకువచ్చింది? ఈ నేపథ్యంలో, కేతిరెడ్డి ఇప్పుడు ఆర్డీటీకి మద్దతుగా మాట్లాడటం రాజకీయ లబ్ధి కోసమేనని స్పష్టం చేశారు. ప్రజలు ఈ అంశాన్ని గమనించాలని వారు తెలిపారు. ఈ ఆర్ డి టి సంస్థ యొక్క సమస్యను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో త్వరలోనే చర్చించి పరిష్కార దిశగా కృషి చేస్తుందని తెలిపారు. ఆర్డిటికీ ఎన్డీఏ ప్రభుత్వం ఎల్లప్పుడు మద్దతుతో పాటు అండదండలుగా ఉంటుందని వారు స్పష్టం చేశారు. ఆర్డిటి విషయమై ఎన్డీఏ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కూడా చర్చిస్తున్నట్లు వారు తెలిపారు. ఆర్డిటి సంస్థ ప్రజలందరికీ అని, ఇందుకు ఎన్డీఏ ప్రభుత్వం భవిష్యత్తులో అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని హరీష్ తెలిపారు.

03ATP07_03ATP07.qxd 07-05-2025 PM 10:37 Page 1



## ఆర్‌డిటి సంస్థను కాపాడుకుందాం..

**- దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలి..**



సేవ్ ఆర్డిటి అంటూ నినాదాలు చేస్తున్న దృశ్యం

**అనంతపురం అర్బన్, మే 7 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లాలో బుధవారం దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సేవ్ ఆర్డిటి నినాదంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌డిటి జిల్లా ప్రజలకు అనేక రకాలుగా సేవలు అందించిందని, 1969 నుండి నేటి వరకు అనేక రకాల సేవలు ఉచితంగా అందించిందని, వైద్యం, విద్య, పండ్లతోటలు, పక్కా గృహాలు నిర్మించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిందని కొనియా డారు. ఈ సందర్భంగా దళిత ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కరువు జిల్లా అనంతపురం అభివృద్ధికి విన్సెంట్ ఫెర్రర్ ఆధ్వర్యంలో ఆర్డిటి సంస్థ ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిందని పేర్కొన్నారు. దళిత గిరిజన ఆత్మగౌరవాన్ని కాపాడిందని వికలాంగులకు ప్రత్యేకంగా స్కూలు పాఠశాలను ఏర్పాటు చేసినారన్నారు. ఆర్డిటి సంస్థను ఎఫ్‌సిఆర్ ఏ అకౌంట్ ను రెన్యువల్ చేయాలని ఈరోజు దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దామోదర్ సంజీవయ్య భవనము నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో పాల్గొన్నవారు కేపీ నారాయణస్వామి. చిన్న పెద్దన్న ఎంఆర్పిఎస్ నాయకులు, తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నగర ప్రధాన కార్యదర్శి చిర్రోళ్ల రామాంజనేయులు, కొంటె మద్ది ఓబులేసు ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు, మీనుగా రామాంజనేయులు ఎస్సీ, ఎస్టీ ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొర్రపాడు రమణ ఎస్సీ, ఎస్టీ జేఏసీ చిన్న ఆంజనేయులు ఎమ్మార్పీఎస్ నాయకులు ఈశ్వరయ్య, భాస్కర జై భీమ్ సేన ఓబులేసు, ఎమ్మార్పీఎస్ నాయకులు రేకులకుంట నల్లప్ప, రాజు, బుక్కరాయసముద్రం వినోద్, రాఘవ, సంజీవులు, చెన్నంపల్లి ఓబులేసు, సత్యమయ్య బళ్లారి ఎర్రిస్వామి, ఎస్సీ ఎస్టీ ఫోరం నాయకులు, మాల ఓబుల్ రాజు, మండల పకీరప్ప, ఎమ్మార్పీఎస్ నాయకులు దిలీపు ఎమ్మార్పీఎస్ నాయకులు, నాగరాజు, కళాకారుల సంఘం అధ్యక్షుడు కదిరప్ప పుల్లన్న, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బుక్స్ నల్లప్ప, కొండన్న, మనోజ్, కడదరగుంట రామచంద్ర, కిష్టప్ప, రమేష్, ఆదిలక్ష్మి, సునీత, పోలమ్మ, చంద్ర శేఖర్, నర్సింలు, తుమ్మెర్ల, ఎమ్మార్పీఎస్ నాయకులు తాడపత్రి రామాంజి, బుగ్గ శివయ్య, మురళి, దళిత ప్రజా సంఘాలు నాయకులందరూ పాల్గొన్నారు.

## వైసీపీ ఆరోపణలు తగవు

**- తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్డే సిమెంట్ పోలన్న**

**అనంతపురం అర్బన్, మే 7 ప్రభాతవార్త**



వడ్డే సిమెంట్ పోలన్న

కూటమి ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా, సొంతకాళ్లపై నిలబడ్డాలనే ఉద్దేశ్యంతో కుట్టుమిషన్ నేర్పించి, ఉచితంగా కుట్టుమిషన్ అందజేసే కార్యక్రమంపై ఆరోపణలు చేయడం తగదని తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్డే సిమెంట్ పోలన్న అన్నారు. బుధవారం జిల్లా టిడిపి పార్టీ ఆఫీస్ కార్యాలయంలో పాత్రికే యుల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి పార్టీ వైసీపీ అని, ఆ పార్టీకి ప్రజలకు ఉపయోగ పడే స్కీమ్ లపై అవాస్తవాలను తమ నాయకులతో ప్రచారం చేయించి, ఉనికి చాటుకునే ప్రయత్నం చేయడం దారుణన్నారు. రాష్ట్రంలో లక్ష మంది మహిళలకు మంచి చేయాలని మంచి ప్రభుత్వం చేస్తుంటే వైసీపీ పార్టీ వారి కళ్లలో కారం చల్లినట్లున్నదని అన్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ 1000 మందికి పైగా శిక్షణ, ఉచిత కుట్టు మిషన్లను అందించేందుకు చొరవచూపడం అభినంద నీయం అన్నారు. పేద, మధ్యతరగతి మహిళలకు కూటమి ప్రభుత్వం భరోసానిస్తుందన్నారు.

## రైతులకు జీవ వైవిధ్య పంటలపై అవగాహన

**శింగనమల, మే 7 ప్రభాతవార్త**



విత్తనం విత్తుతున్న దృశ్యం

మండల పరిధిలోని సోదనపల్లి, చిన్న మట్లగొంది గ్రామాలలో గుత్తి డివిజన్ వారి ఆదేశాల మేరకు సిటిఐఓ, డిపిఎం లక్ష్మా నాయక్, నవీన్ కుమార్ సూచనల మేరకు రైతు ఇగుడూరు అంజలి పొలంలో రెండు ఎకరాలలో పిఎండిఎస్ ఐదు రకాల ప్రధాన పంటలు, 20 జీవ వైవిధ్య పంటలు విత్తనాలను బీజాంమృతతో శుద్దిచేసి ఘన జీవాంమృతంతోపాటు విత్తారు. పిఎండిఎస్ వల్ల భూమిలో అన్ని రకాల పోషకాలు అందుబాటులో ఉంటాయని, 50 శాతం కలుపు రాదన్నారు. దీనిలో తేమ నిల్వ శక్తి పెరుగుతుంది. భూమి కోతకు గురికాదు, పంట దిగుబడి పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని సూచించారు. అనంతరం గ్రామస్తులతో జీవ వైవిధ్య పంటలపై అవగాహన కల్పించారు. రైతులు సోదనపల్లి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ



కుట్టు శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపిడిఓ భాస్కర్

**శింగనమల, మే 7 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని మహిళల కుట్టు శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఎంపిడిఓ భాస్కర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుట్టు శిక్షణకు వస్తున్న మహిళలకు సరైన సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. ముఖ్యంగా వేసవి కాలం అయినందున మహిళలకు మంచి నీరు,ఫ్యాన్ సౌకర్యం కల్పించాలని ఆయన తెలిపారు. ప్రతి రోజు హాజరు శాతాన్ని నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ ఆదినారాయణ, సోషల్ వెల్ఫేర్ అధికారి మధు సూధన, కాయల రమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మూడవ రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల ధర్నా

**అనంతపురం మే 07 ప్రభాతవార్త**

స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సిఐటియు అనుబంధ మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ధర్నా మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో పాలకులు, అధికారయంత్రాంగం పూర్తిగా విఫలమైయ్యారన్నారు. సమస్యల పరిష్కారం అయ్యేంతవరకు వివిధ రూపాల్లో పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటనారాయణ, నాగభూషణం, ఎటిఎం నాగరాజు, ఎర్రిస్వామి, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

## బిసి కులగణను స్వాగతిస్తున్నాం

**-చేతివృత్తిదారుల సంఘం అధ్యక్షుడు లింగమయ్య**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చేతివృత్తిదారుల సంఘం నాయకులు

**అనంతపురం, మే 07, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం బిసి కులగణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చేతివృత్తి దారులు సంఘం రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు సి.లింగమయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా కులగణన చేపట్టాలని ప్రతి పక్షపార్టీలు, ప్రజా సంఘాలు కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తున్నపటికి కులగణన చేపడితే సమాజంలో విభజన వస్తుందన ప్రధాని మోడి తీవ్రంగా వ్యతిరేకించా డన్నాడు. ఈ క్రమంలో బిహార్‌లో ఆర్‌జెడితో కలిసినపుడు ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ బిసి కులగణన చేపట్టి వివరాలు వెల్లడించగా, తెలంగాణాలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుల గణన సర్వే చేపట్టి వివరాలు వెల్లండించిన విషయం తెలిసిందే. అదేవిధంగా కర్ణాటకలో సైతం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కులగణన సర్వేకు ఆమోద ముద్ర వేశార న్నాడు. ఇప్పటివరకు మొండిగా వ్యవహరించిన ప్రధానిలో కదలిక వచ్చి కుల గణన సర్వే చేయడానికి అంగీకరించడం పట్ల హర్షం వ్యక్త చేస్తూ, రాష్ట్ర ముఖ్య మంత్రి నారాచంద్రబాబునాయుడు సైతం సర్వే నిర్వహించడానికి చర్యలు తీసు కోవాలని ఆయన డిమాండ్ చేశాడు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.వి.హరికృష్ణ,నగర కార్యదర్శి వీరాంజి, గౌరవాధ్యక్షులు ఈశ్వరమ్మ, రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సి.నాగప్ప, నాయి బ్రాహ్మణ వృత్తిదారుల సమాఖ్య నగర అధ్యక్షుడు గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

## బాబా శత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం అభినందనీయం

**-జాతీయ సెలవు దినంగా ప్రకటించాలి -భట్రాజు సంక్షేమ సంఘం**



బాబా చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న భట్రాజు సంక్షేమ సంఘం నాయకులు

**అనంతపురం మే 07 ప్రభాతవార**

శ్రీ సత్యసాయి బాబా శత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, విశేష కృషి చేసిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి, ట్రస్టు నిర్వాహకులు ఆర్.జె.రత్నాకర్‌కు ఉమ్మడి జిల్లా భట్రాజు సంక్షేమ సంఘం కృతజ్ఞతలు తెలిపింది. బుధవారం స్థానిక కమలానగర్‌లోని రాజు ఫ్లెక్సీ సెంటర్‌లో ఆ సంఘం సమావేశం నిర్వహించి శ్రీ సత్యసాయిబాబా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బాబా శతజయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం అభినంద నీయమని అదేవిధంగా జాతీయ సెలవు దినంగా ప్రకటించేలా చూడాలన్నది సాయిబాబా భక్తుల చిరకాల కోరిక అన్నారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోనే కాకుండా దేశ విదేశాల్లో శ్రీసత్యసాయిబాబా భకు_లు వున్న విషయం ప్రభుత్వాలకు తెలిసిందేనన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండగగా నిర్వహించాలని, ఇప్పటికే అధికార యంత్రాగానికి బాబా శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం తెలిసిందేనన్నారు. ఈ తరుణంలో జాతీయ సెలవు దినంగా జయంతి రోజును ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో భట్రాజు సంక్షేమ సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు అక్కిరాజు నాగరాజు, ఉపాధ్యక్షుడు, ట్రెజరర్ అక్కిరాజు మారుతీ రాజు, ప్రధాన కార్యదర్శి అబ్బురాజు వెంకటనారాయణరాజు, సహాయ కార్యదర్శి గోవిందరాజు, సీనియర్ నాయకులు సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాసవి జయంతి మహోత్సవం



అలంకరణలో వాసవి కన్యకాపరమేశ్వరి, గ్రామోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

**పామిడి, మే 07 ప్రభాతవార్త**

వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం నందు బుధవారం వాసవి జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో అభిషేక అర్చనలు పూజలు చేపట్టి సర్వ దేవతలను పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రంగురంగుల పూలతో అలంకరణ గావించి వాసవి మాతృమండలి మహిళలు అమ్మవారి కళశాలను చేతబూని మంగళవాయిద్యాల మద్య గ్రామోత్సవాన్ని చేపట్టగా భక్తాదులు పూజలు చేపడుతూ గేయాలను ఆలపించారు. వాసవి సహస్రనామ పారాయణం పఠించారు. నివేదన అనంతరం మహామంగళహారతి సహపంక్తి బోజనాలు జరిగాయి. ప్రత్యేక అలకంరణలో దర్శనమిచ్చిన వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకుంటూ అమ్మవారి కృఫకు పాత్రులయ్యారు. ప్రతిఏటా వైశాఖమాసం శుద్దదశమి రోజున ఆర్యవైశ్యుల ఇలవేల్పుగా ప్రసిద్ధి చెందిన వాసవి జయంతిని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే.నారాయణమూర్తి, స్థానిక అధ్యక్షులు ఉపేంద్ర, ధర్మకర్త సాయిప్రసాద్, నాయకకులు బి.వి.రత్నమయ్య, నల్లయ్య, విశ్వం, నాగార్జున, వాసవి మాతృమండలి అధ్యక్షురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## 20న నిర్వహించే గ్రామీణ హర్తాల్‌ను జయప్రదం చేయండి

**అనంతపురం మే 07 ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 20 కార్మికులు చేస్తున్న దేశవ్యాప్త సమ్మెలకు మద్ధతుగా రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుసంఘం, సిఐటియు అనుబంధ సంఘాలు గ్రామలు, మండల కేంద్రాల్లో (గ్రామీణ హర్తాల్) ర్యాలీలు, ప్రదర్శనలు, రాస్తారోకోలు నిర్వహించి నిరసన వ్యక్తం చేయాలని ఆయా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.

స్థానిక గనేనాయక్ భవన్‌లో బుధవారం రైతు సంఘం ఉపాధ్యక్షుడు తరిమెల నాగరాజు అధ్యక్షతన ప్రజా సంఘాల సమావేశంలో జిల్లా కార్యదర్శులు ఓ. నల్లప్ప, నాగేంద్ర కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, బాలరంగయ్య తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడి ప్రభుత్వం అధికారంలో వుందని, రైతులకు, వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా ఆదాని, అంబాని లాంటి కార్పొరేట్ కంపెనీలకు అనుగుణంగా పాలన సాగిస్తోందని విమర్శించారు. బ్రిటీష్ కాలంలోనే పోరాడి సాధించుకు కార్మికుల హక్కులను రద్దు చేసి 4లేబర్ కోడ్లు తెచ్చిందన్నారు. కార్పొరేటర్ కంపెనీలకు కార్మికులను కట్టు బానిసలుగా మార్చుతోందన్నారు. రైతులు పండించే పంటలకు మద్ధతు ధర ప్రకటించాలని, రైతాంగ అవసరాలకు సంబంధించి పనిముట్టు కొనుగోలు ధరలు తగ్గించి, వ్యవసాయ పెట్టుబడి పెంచాలని, రూ.2లక్షల వరకు బ్యాంకు రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## రామరాజుపల్లిలో ప్రారంభమైన బండిశూల ఉత్సవం

**- ప్రారంభమైన చోటనే ముగింపు ఉత్సవం ప్రత్యేకత**



బండిశూల ఉత్సవ రథంలో సుంకులమ్మ ముత్యాలయ్య దేవతామూర్తులు



భక్తులకు అన్నదానం చేస్తున్న ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి

**పామిడి, మే 07 ప్రభాతవవార్త**

మండల పరిదిలోని రామరాజుపల్లిలో తరతరాల సాంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తున్న బండిశూల (శుడిబండి) ఉత్సవం వేలాదిమంది భక్తుల మద్య బుధవారం అత్యంత ఘనంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవం రామరాజుపల్లిలో ప్రారంభమై పెద్దవడుగూరు మండలం కాసేపల్లి, గుత్తిఅనంతపురం గ్రామాల్లో కొనసాగుతూ తిరిగి రామరాజుపల్లిలోనే ముగియటం మూడు ప్రాంతాలకు చెందిన గ్రామస్థులు భక్తులు పెద్దఎత్తున పాల్గొనటం ప్రత్యేకతను సంతరించుకుంటుంది.

రామరాజుపల్లికి చెందిన రజకులు గుత్తి అనంతపురం వాగు వద్ద బట్టలు ఉతకటం వాటిని తిరిగి గ్రామస్థులకు అందిస్తూ జీవనం సాగిస్తుంటారు. ఈక్రమంలో ఒకరోజు రాత్రి రజకులకు రెండు గాడిదలపై ఇద్దరు వ్యక్తులు కనిపించటం మాట్లాడించినప్పటికీ వారు మాట్లాడకపోవటం వారి వద్దకెళ్తే మాయమవ్వటం ఇలాంటి ప్రక్రియ కొన్నిరోజులుగా జరుగగా భయాందోళనకు గురైన రజకులు గ్రామస్థులను తీసుకుని వెళ్ళి వారిని కదిలించగా తాము సుంకులమ్మ ముత్యాలయ్య దేవతలం అని మా పేర్లతో వైశాఖమాసంలో ఉత్సవం జరుపాలని కోరటం అప్పట్లో చాకలి గాటప్పకు అమ్మోరు పూనకం వచ్చి మద్దికేరలో ఓ బండి ఉందని ఆ బండిలోనే మమ్మల్ని ఊరేగిస్తూ ఉత్సవాన్ని జరుపాలని తెలియజేసినట్లు పలువురు గ్రామస్థులు తెలిపారు. రామరాజుపల్లిలో మొదలయ్యే ఉత్సవాన్ని పురస్కరించుకుని సుంకులమ్మ ముత్యాలయ్య దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంలో కాశేపల్లి, గుత్తిఅనంతపురంకు లాగించటం తదనంతరం వేకువజామున తిరిగి రథం రామరాజుపల్లికి చేరటంతో ఉత్సవం ముగుస్తుందని వివరించారు. ఇదిలావుండగా రామరాజుపల్లిలో సుంకులమ్మ ముత్యాలయ్య పేర్లతో అనేకమంది నామదేయాలను కలిగివుండటం ఆ దేవతామూర్తులపై వారికి ఉన్నటువంటి భక్తిభావం ఏపాటిదో అర్థమవుతుండగా ఉత్సవం ముగింపు రోజున గ్రామంలో వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు స్వాములకు వారి మొక్కుబడులను చెల్లించి జాతరను నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. రామరాజుపల్లిలో పర్యటించి బండిశూల (శుడిబండి) ఉత్సవాన్ని పర్యవేక్షిస్తున్న రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ఆయాగ్రామాల పెద్దలతో చర్చిస్తుండటం గమనార్హం. గ్రామానికి చెందిన పామిడి ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి బండిశూల ఉత్సవానికి తరలివస్తున్న భక్తాదులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలియజేశారు. భోగాతి ముత్యాలరెడ్డి, గోకుల్‌రెడ్డి, సత్యమోహన్‌రెడ్డి, నీలూరు రమణారెడ్డి, సుధీర్‌రెడ్డి, యాపర్ల సుధర్శన్‌రెడ్డి, రామశేఖర్‌రెడ్డి, నొస్సం భాస్కర్‌రెడ్డి, గణేశం సుధీర్‌రెడ్డి, మొడియం శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని శ్రీ సుంకులమ్మ ముత్యాలయ్య ఉత్సవానికి తరలివస్తున్న భక్తులు ఆయాగ్రామాల ప్రజలు అన్నప్రసాదంను స్వీకరించాలని కోరారు.

## ఆర్డిటిపై ఆంక్షలు విదిస్తే ఉద్యమాలు ఉధృతం చేస్తాం

**- 3వ రోజు రిలే దీక్షల్లో..సిపిఐ కార్యదర్శి జాపర్**



మాట్లాడుతున్న సిపిఐ కార్యదర్శి జాఫర్

**అనంతపురం న్యూటౌన్, మే 7 ప్రభాతవార్త**

ఆర్టీటిపై ఆంక్షలు అడ్డంకులు విదిస్తే మరింతగా ఉద్యమాలు ఉదృతం చేస్తామని ద్వి జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు.ఆర్టీటి ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు మూడవ రోజు రిలే దీక్షలకు టివి రెడ్డి అధ్యక్షతన జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాపర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో 21జిల్లాల్లో ఆర్టీటీ సంపూర్ణ సేవలు అందించిన ఆర్టీటీని కేంద్ర ప్రభుత్వం కక్షయ సాధింపులకు దిగడం దారుణమన్నారు. పేద ప్రజలకు విద్య,వైద్యం ఆమడదూరంలో ఉండేదని జీవించడానికి ఇల్లు లేక పూరేగుడేసేల్లో నివసించే వారికి అన్ని తానై ఆదుకొన్న గొప్ప ఘనత ఆర్టీటీకే దక్కుతుందన్నారు. ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ చేయించడంలో ముఖ్యమంత్రి పాత్ర మొదటిది కావాలన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ.. ఆర్టీటీ విదేశీ నిధులు రాకుండా ఆపేస్తూ అకౌంట్లు సీజ్ చేయడం చూస్తుంటే పథకం ప్రకారం జరుగుతున్న కుట్రగా అర్థమోతోందన్నారు.అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సాకే హరి మాట్లా డుతూ.. పేదరిక రూపురేఖలను లేకుండా చేయడమే ఆర్టీటీ లక్ష్యమన్నారు. తరిమెల రాజు కళాకారుల బృందం ఆర్టిటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ పెర్రర్ సేవలను కీర్తిస్తూ పాడిన పాటలు దీక్ష శిబిరాన్ని ఆలోచింపజేసేలా ఆకట్టుకున్నాయి. సంఘీభావం తెలియజేయడానికి జెడ్పీ వైస్ చైర్మన్ వేదాంతం నాగరత్నమ్మ. డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్ రెడ్డి. చామలూరు రాజగోపాల్. పూర్వపు ఆర్టీటీ ఉద్యోగులు గోవిందప్ప.శివశంకర్. లేప్రసి సంఘం రామ కృష్ణ రెడ్డి.జై భీమ్ సేన బికేఎస్ ఆనంద్.హరినాథ్ రెడ్డి.జై భీమ్ రామాంజినేయులు. చంద్ర చర్ల హరి. ఉరుముల రాము.రాజేష్.వసంత కుమార్.సాకే గోవర్ధన్. రామక్రిష్ణ సాకే శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కేక్ కట్ చేసి తినిపిస్తున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, మే 7 ప్రభాతవార్త**

మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నదని, అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మైనార్టీలకు ఎల్లవేళలా అండగా ఉండి మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ మైనార్టీ అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం అనంతపురం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన పుట్టినరోజు వేడుకలను ఫిరోజ్ హిందూ ముస్లిం మిత్రమండలి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముందుగా అర్బన్ ఎమ్మెల్యే కార్యాలయంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, తెలుగుదేశం పార్టీనాయకులు గంగారం, బుగ్గయ్య చౌదరి తదితరులు ఫిరోజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మైనార్టీ నాయకులు మాజీ కో ఆప్షన్ సభ్యులు మునవ్వర్, మైనార్టీ నాయకులు సైఫుద్దీన్, ఖాజాపీర్,జనసేన కాలేషా, మదన్ పవన్,మన్సూర్,నందమూరి ఫ్యాన్స్ అలీ, అస్లం చాంద్, పర్వేజ్, సాదిక్, కరీముల్లా మసూద్,జాకీర్, అన్వర్, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రేషన్ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకోండి

**- శింగనమల మండల తహశీల్దారు బ్రహ్మయ్య**

**శింగనమల, మే 7 ప్రభాతవార్త**



బ్రహ్మయ్య

మండల పరిధిలోని గ్రామ సచివాలయ కేంద్రాల్లో కొత్త రేషన్‌కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని శింగనమల మండల తహశీల్దారు బ్రహ్మయ్య తెలిపారు. బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ పౌర సరఫరాల శాఖ కమిషనర్ విజయవాడ, అనంతపురం జిల్లా క లెక్టర్ ఆదేశాలతో కొత్త రేషన్‌కార్డు పొందాలన్నా, రేషన్‌కార్డులో పేర్లు మార్చుకోవాలన్నా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. రేషన్‌కార్డులో కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లు ఎక్కించుకోవచ్చు, రేషన్‌కార్డు వద్దనుకుంటే తొలగింపునకు దరఖాస్తు చేసుకోవచ్చు, కుటుంబ విభజనలో భాగంగా కొత్త రేషన్‌కార్డు మంజూరు చేస్తారు. రేషన్‌కార్డులో చిరునామా మార్చుకోవచ్చని, తప్పులు సైతం సరిచేసుకోవచ్చన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలకు రేషన్‌కార్డు లేకపోతే కొత్తకార్డుకు దరఖాస్తు చేసుకోవడానికి వీలుంటుంది. మండల వ్యాప్తంగా అర్హులైన వారు కొత్త రేషన్‌కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

## కట్ట కిందపల్లెలో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు



డ్రైనేజీ కాలవలను శుభ్రం చేయిస్తున్న దృశ్యం.

**అనంతపురం రూరల్, మే 07 ప్రభాతవార్త**

అనంతరం రూరల్ మండలం కట్ట కింద పల్లి గ్రామంలో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా నాకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి గోవిందరాజులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్ట కింద పల్లి గ్రామంలో నివసించే ప్రజలు ఎవరు డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకొని గ్రామంలోని డ్రైనేజీ కాలువలు ప్రతిరోజు శుభ్రం చేస్తూ డ్రైనేజీ కాలువలపైన బ్లీచింగ్ పౌడర్ వేస్తూ కాలువలను శుభ్రంగా ఉంచడం జరుగుతుందన్నారు.

## ఎంపిడిఓ వెంకట లక్ష్మికి ఘన సన్మానం



ఎంపిడిఓ వెంకటలక్ష్మిని సన్మానిస్తున్న ఉద్యోగులు

**శింగనమల, మే 7 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఈఓఆర్డిగా విధులు నిర్వహిస్తున్న ఎంపిడిఓ వెంకట లక్ష్మి బుధవారం జిల్లా పరిషత్ చైర్మన్ బోయ గిరిజమ్మ చేతులు మీదుగా ఎంపిడిఓగా పదోన్నతి ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ భాస్కర్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ఎంపిడిఓ వెంకట లక్ష్మిని ఘనంగా సన్మానించారు.

## ముంటి మడుగు కేశవరెడ్డిని కలిసిన బ్యాళ్ల నాగేంద్ర

**శింగనమల, మే 7 ప్రభాతవార్త**



ముంటిమడుగు కేశవరెడ్డికి పూల బొకేను ఇస్తున్న బిసి నాగేంద్ర

ఇటీవల ఏడిసిసి బ్యాంకు చైర్మన్‌గా ఎంపికైన ముంటిమడుగు కేశవరెడ్డిని బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బిసి నాయకులు టిఎన్‌టియుసి రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాళ్ల నాగేంద్ర, టిడిపి నాయకులు వడ్డెర సంఘం నాయకులు మల్లెల జయరామ్‌తో కలిసి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఘనంగా సత్కరించారు.

## నేటి నుంచి 15 వరకు రూరల్‌లో ఆధార్ క్యాంప్

**అనంతపురం రూరల్,మే 07 ప్రభాతవార్త**

అనంతపురం రూరల్ మండలములో 8 నుంచి 15 వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి దివాకర్, మండల పరిపాలన అధికారి శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు తెలిపారు. 8.వ తేదీన చియ్యేడు, ఆలమూరు, అక్కంపల్లి, కామారుపల్లి గ్రామ పంచాయితీలలో,12. వ తేది న చియ్యేడు, మన్నిల, అక్కంపల్లి, కందుకూరు1 గ్రామ పంచాయితీలలో, 13. వతేది పూలకుంట, మన్నిల, ఆకుతోటపల్లి1,కందుకూరు1 గ్రామ పంచాయితీలలో, 14 వ తేది న పూలకుంట, సోమలదొడ్డి, ఆకుతోటపల్లి2, కందుకూరు2 గ్రామ పంచాయితీలో,15. తేదీ తాటిచెర్ల, సోమలదొడ్డి, ఇటుకలపల్లి, కందుకూరు2 గ్రామ పంచాయితీలో ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని కావున పై అవకాశాన్ని మండల ప్రజలందరూసద్వినియోగంచేసుకొనవాలని ఎంపీడీవో దివాకర్ కోరారు.

## త్రివిధ సాయుధ దళాల సేవలు ప్రశంసనీయం

**అనంతపురం కలెక్టరేట్ మే 07 ప్రభాతవార్త**

త్రివిధ సాయుధ దళాల పతాక దినోత్సవ సందర్భముగా వివిధ సంస్థలు, పాఠశాలలు మరియు కళాశాలల నుండి సేకరించిన హుండీ బాక్స్ లను జిల్లా కలెక్టర్ నియమించిన కమిటీ సమక్షములో 75 హుండీ బాక్స్ లను బుధవారం జిల్లా సైనిక్ సంక్షేమ కార్యాలయములో లెక్కించడం జరిగింది. హుండీ బాక్స్ ల మొత్తం 109710 రూపాయలు మరియు దాతల నుండి వచ్చిన 3,76,992 రూపాయలు త్రివిధ సాయుధ దళాల పతాక అకౌంట్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 62076956433 లో జమ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, కమిటీ సభ్యులు సి.మాదవ కృష్ణయ్య డిప్యూటీ తహశీల్దార్, ఏపీ ఎస్పి డి సీ ఎల్ . జెసి.603882 పి. నాయక్, సుబేదార్ ప్రకాష్ సాహా, ఎన్‌సిసి ఆఫీసు మరియు మాజీ సైనికులు పెంచలయ్య, హుస్సైన్, కృష్ణ, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఆర్థిక శాఖ మంత్రి


కాలువ వెడల్పు పనుల గురించి అధికారులతోచర్చిస్తున్న ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్


హెలిపాడ్ వద్ద నుంచి కాలువ వరకు చేపట్టిన పనులను పరిశీలిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

**వజ్రకరూరు మే 7 ప్రభాతవార్త**

ఈనెల తొమ్మిదిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండలంలోని ఛాయాపురం గ్రామంలో పర్యటిస్తున్న నేపథ్యంలో బుధవారం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌లు ఛాయాపురం గ్రామం వద్ద హెలిప్యాడ్ పనులు, గ్రామ సభకు సంబంధించిన పనులను పరిశీలించారు. మంత్రికాలువ వెడల్పు పనులపై అధికారులతో చర్చించారు. హెలిపాడ్ వద్ద నుండి గ్రామసభ వరకు సంబంధించిన ఏర్పాట్లను అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ ను వారు పరిశీలించారు. పర్యటనలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు పర్యవేక్షించాలన్నారు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్ జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సిఎంఓ కార్యాలయం అధికారులు స్థానిక తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహ భూమిపూజలో ఎంపీ దంపతులు



**హిందూపురం టౌన్ మే 07 ప్రభాతవార్త**

కాలభైరవేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట భూమి పూజ కార్యక్రమంలో బుధవారం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. హిందూపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీ నంజంలేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో త్వరలో నిర్వహించనున్న శ్రీ కాలభైరేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకొని భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఎంపీ సతీమణి శ్యామలాదేవి, కుమారుడు వీక్షిత్ పాల్గొని పూజలు నిర్వహించారు.

పూజల్లో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మినారాయణ దంపతులు

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టండి

## - జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్


విమానాశ్రయం భద్రతపై ఎస్పితో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్

**పుట్టపర్తి (కల్చరల్), మే 7, ప్రభాతవార్త**

ఈ నెల 9వ తేదిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా పుట్టపర్తి విమానాశ్రయం నందు పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పుట్టపర్తి విమానాశ్రయంను సందర్శించి ముఖ్యమంత్రి పర్యటనపై ముందస్తు ఏర్పాట్లు పరిశీలించారు. 9వ తేదీ విజయవాడ విమానాశ్రయం నుండి బయలుదేరి ఉదయం పుట్టపర్తి విమానాశ్రయానికి 10:50 గం॥ పుట్టపర్తి విమానాశ్రయం నుండి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి పొరబాట్లు జరగకుండా జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని, ముఖ్యంగా పోలీస్ శాఖ, ఆర్ అండ్ బి, హెల్త్, అగ్నిమాపక శాఖ, అంబులెన్సులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రత్న, ఆర్డీవో సువర్ణ, పుట్టపర్తి విమానాశ్రయ అధికారి లక్ష్మినారాయణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వాస్తవాలను చెక్ చేసుకోకుండా సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ పోస్టులు పెట్టి ఇబ్బందులు తెచ్చుకోవద్దు

## జిల్లా ఎస్పీ పి.జగదీష్



**అనంతపురం కలెక్టరేట్ మే 7 ప్రభాతవార్త**

అలజడులు, విద్వేషపూరితమైన మెసేజ్లను... ఆడియో, వీడియోలను షేర్ చేస్తే చట్ట ప్రకారంగా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ టీ జగదీష్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఫెహల్గాం ఉగ్రదాడి, అనంతర పరిణామాల నేపథ్యంలో... విద్వేషపూరితమైన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా షేర్ చేసినా, పోస్ట్ చేసినా... ఆడియో, వీడియో మెసేజ్ ల రూపంలో గ్రూపుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సామాజిక మాధ్యమాల గ్రూపులను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా పోలీసులు, సైబర్ సెల్ పోలీసులతో నిఘా ఉంచామని... తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయొద్దని కోరారు.

# ఒక మహో జ్వలశక్తి అల్లూరి -జిల్లా ఎస్పీ వి.రత్న


అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పి వి.రత్న

**పుట్టపర్తి, మే 07, ప్రభాతవార్త**

భారత స్వతంత్ర చరిత్రలో ఒక మహో జ్వలశక్తి అల్లూరి సీతారామరాజు అని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ వి.రత్న కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో అల్లూరి సీతారామ రాజు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామరాజు పాత్ర కీలకమైందని, పరిమిత వనరులతో బ్రిటిష్ వారిని గడగడలాడించిన పోరాటయోధుడని, మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామ రాజు అన్నారు. గెరిల్లా యుద్ధ తంత్రకళను ఉపయోగించి బ్రిటీష్ సైన్యానికి ముచ్చెమటలు పట్టించారు. స్థానికులు ఆయనను 'మన్యం వీరుడు' అని పిలుచుకునేవారు. అడ్డతీగల, అన్నవరం, చింతలపల్లి కృష్ణదేవపేట రంపచోడవరం నర్సీపట్నం ప్రాంతాలలో ఆయన సాగించిన ఆయుధ పోరాటాలు అల్లూరిలోని అకుంఠిత స్వతంత్ర దీక్షకు ఆనవాళ్ళని కొనియాడారు.

# లక్ష్మినరసింహుని పాద పావనం పెన్నహోబిళం..!!

## - రేపటి నుంచి లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలు - 15న గరుడ వాహనోత్సవం, శ్రీవారి 'కళ్యాణోత్సవం' - 17న లక్ష్మినారసింహుని బ్రహ్మ రథోత్సవం - చకచకా జరుగుతున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు


పెన్నహోబిళంలోని లక్ష్మినరసింహస్వామి ఆలయం





లక్ష్మినరసింహస్వామి మూలవిరాట్, ఉద్భవలక్ష్మి అమ్మవారి మూలవిరాట్,మరమ్మతులు పూర్తీ చేయించిన పాత రథం, విలేఖరులతో మాట్లాడుతున్న ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు


ఉగ్రనరసింహ, ప్రహల్లాద, హిరణ్యకసిపుడి విగ్రహాలు

**ఉరవకొండ, మే 7 ప్రభాతవార్త**

ఉరవకొండ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలు స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం వైశాఖ శుద్ధ ద్వాదశి ఈనెల 9వతేదీ శుక్రవారంనుంచి ప్రారంభం కానున్నాయి. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం 20వ తేది మంగళవారం వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. 9న ద్వాదశి శుక్రవారం మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామం నుండి శ్రీవారి ఉత్సవ మూర్తులను పెన్నహోబిళం తీసుకురావడంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి సాకే రమేష్‌బాబు తెలిపారు. 10న త్రయోదశి శనివారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి ప్రాకారోత్సవం జరుగుతుందన్నారు. 11న చతుర్దశి ఆదివారం ఉదయం సింహ వాహనోత్సవం, సాయంత్రం చంద్రప్రభ వాహనోత్సవం, 12న పౌర్ణమి సోమవారం సాయంత్రం గోవాహనోత్సవం, శేషవాహనోత్సవం, 13న పాడ్యమి మంగళవారం సాయంత్రం హంసవాహనోత్సవం, 14న విదియ బుధవారం సాయంత్రం హనుమంత వాహనోత్సవం జరుగుతుందన్నారు. 15న తదియ గురువారం సాయంత్రం గరుడ వాహనోత్సవం, అనంతరం రాత్రి 8 గంటలకు కళ్యాణోత్సవం జరుగుతుందన్నారు. 16న చవితి శుక్రవారం సాయంత్రం సూర్యప్రభ, ఐరావత వాహనోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 17న పంచమి శనివారం ఉదయం 11 గంటలకు మడుగుతేరు, సాయంత్రం 5 గంటలకు బ్రహ్మ రథోత్సవం జరుగుతుందన్నారు. 18న షష్టి ఆదివారం సాయంత్రం అశ్వవాహనం, 19న సప్తమి సోమవారం సాయంత్రం ధ్వజా అవరోహణం, శయనోత్సవం, 20న అష్టమి మంగళవారం ఉత్సవ విగ్రహాలు పెన్నహోబిళం నుండి ఆమిద్యాలకు తరలి వెళతాయని దీంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు.

**పాత రథానికే పూర్తీ అయిన మరమ్మతులు:**

కాగా కొత్త రథం తయారీ పనులు నామమాత్రంగా జరిగి అర్ధాంతరంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడా పాత రథంతోనే రథోత్సవం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. గత 2023 ఏప్రిల్ 29న మరమ్మతుల సమయంలో క్రేన్ పట్టుతప్పి కూలిపోయి ధ్వంసమైన విషయం తెలిసిందే. పాత రథానికి సంబంధించి ఒక చక్రం పూర్తిగా శిధిలంకాగా కొత్త చక్రాన్ని తయారు చేయించి ఈనెల 17న బ్రహ్మ రథోత్సవంరోజు లాగేందుకు సిద్ధం చేశారు. అయితే రథాన్ని ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించి ట్రయల్ రన్ నిర్వహించి ఫిట్‌నెట్ సర్టిఫికేట్ ఇవ్వాల్సి ఉంది.

**ఆలయ సంక్షిప్త చరిత్ర:**

అనంతపురం-ఉరవకొండ ప్రధాన రహదారికి ప్రక్కన పెన్నానదికి 3 కిలోమీటర్ల దూరమునవున్న గిరిపై పెన్నహోబిళ లక్ష్మినరసింహస్వామి దేవస్థానం వెలిసింది. ఈ గిరిపై పూర్వము ఉద్దాలక మహర్షి తపస్సు గావించినట్లు చరిత్రక ఆధారాలు చెబుతున్నాయి. ఈ గిరికి క్రింది భాగాన తూర్పుదిశకు గొల్లపల్లి అనే గ్రామం ఉండేదని ఈ గ్రామములో ఒకగోవు ప్రతిదినం బిలమువద్ద క్షీరము ఇచ్చేదని గోవు యజమాని తనగోవు పొదుగులో పాలు లేకుండుట గమనించి కలత చెందగా లక్ష్మినరసింహస్వామి ఆయనకు అగుపించి నేను నీ గోక్షీరమును సేవించుచున్నానని చెప్పగా గోయజమాని సంతోషభరితుడై బిలప్రాంతము శోధించగా బిలముపై భాగమున స్వామివారి పాదముద్రికగల శిలాఫలకము, క్రింది భాగమున నైరుతి దిశన లక్ష్మీదేవి అమ్మవారి శిల అగుపించిందని కథనం. గొల్లపల్లి వాసులు శ్రీవారికి, అమ్మవారికి చిన్న ఆలయాలు నిర్మించి పూజలు నిర్వహిస్తుండగా విజయనగర సామ్రాజ్యాధీశుడైన సదాశివరాయలువారు విజయనగరం నుండి పెనుగొండ దుర్గమునకు పయనించుచూ ఈ క్షేత్రములో మజలీ గాలించాడట. సదాశివరాయలువారికి స్వామివారు స్వప్నములో కనిపించి తన జైత్రయాత్ర దిగ్విజయమవుతుందని ఆశీర్వదించినట్లు చెబుతారు. సదాశివరాయలువారు తన జైత్రయాత్రను ముగించుకొని తిరుగు ప్రయాణంలో స్వామివారిని దర్శించి స్వామివారికి, లక్ష్మీదేవి అమ్మవారికి ఆలయములు నిర్మించవలసినదిగా తన ఉదిరిపికొండ ప్రాంత ప్రతినిధికి ఆదేశించినట్లు చెబుతారు. లక్ష్మినృసింహస్వామి ఆలయపాలనకు పెన్నహోబిళ శోత్రియ గ్రామము దానముగా ఇచ్చినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఉదిరిపికొండ ప్రాంత రాజప్రతినిధి ఆలయ నిర్మాణం గావించి ఏకశిలగల ద్వీపస్థంబముతో పాటు రాజుగారి గుర్తుగా ఏకశిల విజయస్తంభంను క్షేత్రము నందు ప్రతిష్టించారు. దాదాపు 45 అడుగులపైబడి ఎత్తుగల రెండు శిలలు ఈ క్షేత్రంలో కనిపిస్తాయి. ఈ క్షేత్రంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవారి స్వయంభువులు. ఈ క్షేత్రము పెన్నానది సమీపమున వెలసి యుండుట, స్వామివారి పాదముద్రిక క్రింది భాగమున బిళం ఉండుటచేత ఈ క్షేత్రం పెన్నహోబిళం అని పిలువబడుతోంది. క్రింది భాగమున అమ్మవారి ఆలయంలో గత 30 సంవత్సరాల నుండి పుట్ట అక్కడ వెలసిన శిలఎత్తుగా పెరుగుచుండటం విశేషం.

**బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు:**

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు తెలిపారు. ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడారు. కొత్త రథం తయారీ ఆగిపోయిన క్రమంలో పాత రథాన్నే మరమ్మతులు చేయించామన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు సమక్షంలో ట్రయల్ రన్ నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికేట్ పొందిన తరువాత 17న రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, నీడ ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆయన వివరించారు.

# రైతులకు దాణా పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ కాలవ


రైతులకు దాణాను అందిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

**రాయదుర్గం, మే 07 ప్రభాతవార్త:**

రాయదుర్గం మండల పరిధిలోని 74ఉడేగోలం గ్రామం నందు 50శాతం సబ్సీడితో పశువుల దాణని ప్రభుత్వవిప్, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాటాలడుతూ ఈ అవకాశాన్ని పాటి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్ నాగలింగేశ్వర్ 50కేజీల దాణ బ్యాగ్ పూర్తి ధర రూ.1,110 ఉందని 50%సబ్సీడి పోను రైతు కట్టవాల్సిన వాటా రూ.555ఉండగా ముందుగా రాయదుర్గం మండలానికి గాను 25మెట్రిక్ టన్స్ కేటాయించారని, దీని వలన సుమారు 500మంది పాటి రైతులకు లబ్ది చేకూరుతుందని ఆయన ఎమ్మెల్యేకు వివరించారు. మండల పశువైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి పశువుల దాణ ఉపయోగాలు వివరిస్తూ శాఖ తరుపున అమలవుతున్న పశు బీమా, గోకులాలు, నీటి తొట్టెల నిర్మాణం వంటి వివిధ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ హనుమంతు, మాజీ జడ్పిటిసి విజయ్‌కుమార్, శివానంద, జుంజురాంపల్లి సర్పంచ్ వన్నూరుస్వామి, ఓబన్న, పాడి రైతులు మరియు మండలంలో ఉన్న పశుసంవర్ధక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విప్లవం తీసుకువచ్చిన అల్లూరి పోరాటం

## - జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్


అల్లూరి సీతారామ రాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

**పుట్టపర్తి (కల్చరల్), మే 07, ప్రభాతవార్త**

స్వాతంత్ర సమరంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం విప్లవం తీసుకువచ్చినందని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ కొనియాడారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జాతికి అల్లూరి చేసిన సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి చరిత్ర ఒక ప్రత్యేక అధ్యాయమని, ఆయన స్వాతంత్ర్య పోరాటం ఎందరో వీరులకు స్ఫూర్తినిచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ విజయ సారధి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, ఏవో వెంకటనారాయణ, పర్యటక శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, డిఐపిఆర్‌ఓ వేలాయుధం, కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల సిబ్బంది ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హిందూపురానికి 92.50 కోట్లు విడుదల

## ఫలించిన బాలయ్య కృషి థాంక్స్ చెప్పిన నాయకులు


కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్ తదితరులు

**హిందూపురం మే 7 ప్రభాతవార్త**

హిందూపురం అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని స్థానిక శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఏకంగా రూ. 92.50 కోట్ల నిధులను హిందూపురం పట్టణ అభివృద్ధి కోసం విడుదల చేస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పిఏ బాలాజీ ఆధ్వర్యంలో సాయంత్రం ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి కేక్ కట్‌చేసి నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో నిధులు కొరతతో ఉన్నప్పటికీ ఎమ్మెల్యేబాలయ్య పట్టు వదలకుండా చేసిన కృషితో భారీ ఎత్తున నిధులు పురానికి విడుదల అయ్యాయని థాంక్స్ చెప్పారు. ఈ నిధులతో మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు డ్రైనేజీలు లైటింగ్ సిస్టం మొదలగు అభివృద్ధి పనులకు వినియోగించడం జరుగుతుందని త్వరలోనే టెండర్లు ప్రక్రియ జరుగుతుంది అన్నారు. త్వరలో 130 కోట్లు నిధులు కూడా రానున్నాయని దీనితో తాగునీటి వ్యవస్థ మరింత పటిష్టం అవుతుందన్నారు. హిందూపురం ప్రజల తరపున థాంక్స్ బాలయ్య అంటూ పేర్కొన్నారు అన్నారు. ఈ సందర్భంగా నాయకులందరూ థాంక్స్ బాలయ్య అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమర్నాథ్, నెట్టెప్ప, హెచ్ఎం రాము, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జె.సి


భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే జె.సి అష్మిత్ రెడ్డి

**తాడిపత్రిటౌన్, మే 7 ప్రభాతవార్త**

పట్టణసమీపంలోని కడపరోడ్డులో ఏర్పాటు చేయనున్న వాసవి కన్యకా పరమేశ్వరి విశ్వరూప దర్శన విగ్రహ ప్రతిష్టకు బుధవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జె.సి అష్మిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించి భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే జె.సి ని ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా తాడిపత్రి పట్టణంలో ఆర్య వైశ్యసంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవిమాత గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవం లో వందన డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల కోలాటం పట్టణ వాసులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు తలుపుల సురేంద్రనాథ్, తాడిపత్రి ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షులు పెండెకంటి అవినాష్, కార్యదర్శి గాజులపల్లి గౌరీశంకర్, ట్రెజరర్ జయవరం సందీప్ కుమార్, ఉపాధ్యక్షులు వరుణ్ కుమార్, బచ్చు లోకేష్ బాబు, జాయింట్ సెక్రటరీలు కామిశెట్టి యశ్వంత్ కుమార్, టంగుటూరు సాయి సుకేశ్, తదితరులు పాల్గొన్నారు.

# భారత సైనిక దళాలకు సెల్యూట్..!

## సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి

**మడకశిర టౌన్ మే 7 ప్రభాతవార్త,**

పాకిస్తాన్ తీవ్రవాద శిబిరాలపై భారత సైనికులు విజయవంతంగా దాడి చేసి సింధూర్ ఆపరేషన్ విజయవంతం చేసినందుకు మద్దతుగా తన స్వగ్రామమైన నీలకంఠాపురంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు ,మాజీ మంత్రి రఘువీరా రెడ్డి తమ గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు, బుధవారం మడకశిరం మండల పరిధిలోని నీలకంఠాపురం భారత ఆర్మీకి సి డబ్ల్యూ సి నెంబర్ రఘువీరారెడ్డి సెల్యూట్ చేశారు. జాతీయ జెండాను చేత పట్టుకొని జై జవాన్ జై కిసాన్ , పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ సైనికులకు మద్దతు ఇస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నీలకంఠాపురం దేవస్థానంలోని యాగశాలలో శత్రు నాశన హోమం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ భారతదేశ సమగ్రతపై దెబ్బతీసే ఆలోచనలు ఏ దేశం చేసినా సమైక్యంగా మనం భారత సైనికులకు అండగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సింధూర్ ఆపరేషన్ ద్వారా ఉగ్రవాద స్థావరాలను మట్టు పెట్టిన భారత సైనికులకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన సెల్యూట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్,రిటైర్డ్ డి.ఎస్.పి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, భయప్ప రెడ్డి , చిత్తనగిరియప్ప శంకర్ రెడ్డి గ్రామస్తులు తదితరులు,పాల్గొన్నారు.